సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి!

వాయిస్ ఆఫ్

# చార్వాక





సామాజిక చైతన్య మాసపత్రిక

సంపుటి : 19 సంచిక : 2 ఏప్రిల్ – జూన్ 2024




భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభ దృశ్యములు



'బి.చార్వాక' ప్రథమ వర్ధంతి సభ దృశ్యములు

ప్రచురణ :
చార్వాకాశ్రమం

నిర్వహణ :
నాస్తిక సమాజం

# వాయిస్ ఆఫ్ చార్వాక

ఏప్రిల్ - జూన్
2024



గౌరవ సంపాదకులు : డా|| భాను ప్రసాద్

ప్రధాన సంపాదకులు : బి. సుధాకర్

సహాయ సంపాదకులు :
జంజనం సత్యనారాయణ
సత్య నిర్ధారణ్
యం.యన్. బుద్ధ
వి.వి.డి.ఎస్. ప్రసాద్
లతీఫ్
కొర్రపాటి హనుమంతరావు
నండూరి నారాయణరావు
నాస్తిక్ శ్రీకాంత్



**రచనలు, అభిప్రాయాలు, విరాళాలు**
పంపవలసిన చిరునామా :
**బి. సుధాకర్**
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),
మంగళగిరి (మండలం)
గుంటూరు జిల్లా - 522 503.
సెల్ : 9290619550, 9440101814
ఎకౌంట్ నెం. 30174955006,
SBI Main Branch, Mangalagiri
IFSC Code : SBIN0001011
Google Pay, Phone Pay : 9290619550
voiceofcharwaka@gmail.com


శాస్త్రీయ స్పృహను
మానవ వాదాన్ని, పరిశీలనాతత్వాన్ని,
సంస్కరణను పెంపొందించటం
ప్రతి భారతీయ పౌరుని విధి,
భారత రాజ్యాంగం
ఆర్టికల్ 51(A)(H) రూల్ IV A.


**పత్రికలో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. పత్రిక యాజమాన్యం వారి అభిప్రాయాలతో ఏకీభవించనవసరం లేదు.**


## ఈ సంచికలో...


| | | |
|---|---|---|
| 1. | నాస్తిక జీవిత విధానం! సమాజ ప్రగతికి సాధనం!! | 3 |
| 2. | నాస్తిక చతురోక్తులు | 5 |
| 3. | ఆదిమానవుల సైన్స్ | 9 |
| 4. | క్రైస్తవ మతం మూలాలు | 12 |
| 5. | శ్రీ వేంకటేశ సుప్రభాత శృంగారం | 15 |
| 6. | మెటాఫిజిక్స్ | 17 |
| 7. | దేవగుప్తపు పేరలింగంకు జోహార్లు | 19 |
| 8. | భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్థంతిసభ | 21 |
| 9. | ఆహారం - ఆరోగ్యం | 22 |
| 10. | గాంధీ - భగత్‌సింగ్ | 26 |
| 11. | భారతచరిత్రలో అతిపెద్ద నాస్తిక ఉద్యమం | 30 |
| 12. | మారిన మనస్సు | 35 |
| 13. | అమెరికా-భారత్ మధ్య వ్యాపార సంబంధాలు | 36 |
| 14. | నడపాలిరా... ఎన్ని ఆటంకాలొచ్చినా | 40 |


"మీరు పోగొట్టుకున్న వాటినే ఇతరులు పొందారు. ఇతరులతో పోల్చుకున్నపుడు మీ అవమానాలు ఇతరులకి గర్వకారణం. మీరు పేదతనాన్ని, అవమానాల్ని అనుభవించడానికి, మీకు జీవితవసరాలు లేకుండా చేయడానికి మీరు గత జన్మలో చేసుకొన్న పాపాలు మాత్రం కాదు.

మీపైన ఉన్న హిందువుల ప్రబలమైన దౌర్జన్యపూరిత ద్రోహం వల్లే ఇదంతా జరిగింది. ఇతరులు అన్యాయంగా మీ భూముల్ని అక్రమించుకొనడం వల్లే మీకు భూములు లేకుండా పోయాయి.

ఉద్యోగాల్లో ఇతరుల గుత్తాధిపత్యం కారణంగానే మీకు ఉద్యోగాలు లేకుండా పోయాయి. విధిపై నమ్మకం వీడి, మీ శక్తి పై నమ్మకం ఉంచండి!"

– డా. బి.ఆర్. అంబేద్కర్,
ఆర్థిక తత్వం (పేజీ 38)


నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి, గుంటూరు జిల్లా - 522 502.
ఫోన్ : 91777 21588, https://charvaka.co.in/

# నాస్తిక జీవిత విధానం! సమాజ ప్రగతికి సాధనం!!

ఓ మనిషీ!

ఆగి ఒక్కసారి ఆలోచించు, నీ సంగతీ, సమాజం సంగతీ నీవు ఎప్పుడైనా ఆలోచించావా? రాత్రింబవళ్ళు కష్టించినా పేదవాడివిగానే ఎందుకున్నావు? ఏమీ కష్టపడనివాడు కోట్లకు పడగలెత్తుతున్నాడు ఎందుకని? నీలాగే పుట్టినవాడు పెద్ద కులస్థుడుగా గౌరవించబడుతుంటే నీవు హీనంగా చూడబడుతున్నావు ఎందుకని? కుల తేడాలు, మత తేడాలు, ఆస్తి తేడాలు, వర్గ తేడాలు ఎందుకున్నాయి? ఎప్పుడైనా ఈ సంగతులు ఆలోచించావా? ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా నీకు ఏర్పడిన బాధలు, బానిసత్వాన్ని పోగొట్టుకోవా? సాంఘికంగా గౌరవం పొందవా? ఎందుకని చేతకానివాడవు అవుతున్నావు? నీ ఖర్మా? నీ తలరాతా? పూర్వజన్మ కర్మఫలమా? కాదు – కాదు ముమ్మాటికీ కాదు. ఇవన్నీ అబద్ధాలు.

ఏ దేముడూ నీ బ్రతుకును బాగుచేయడు. బాగుచేయలేడు. ఎందుకో తెల్సా? అసలు దేముడనేవాడే లేడు కాబట్టి. మతం నీకు మేలు చేయలేదు. మతమో దేవుడో నిన్ను బాగు చేస్తే ఈపాటికి ఎప్పుడో నీ బ్రతుకు బాగుపడేది. తరతరాలుగా సాంఘిక అవమానాలకు, ఆర్థిక బాధలకు, రాజకీయ అగౌరవానికి ఎందుకు గురి అవుతున్నావు? దైవం, మతం, కులాలు కారణం. ఇవి పాలకవర్గాల సృష్టి. కాబట్టే అవి నిన్ను బాగుచేయలేవు. రాజకీయపార్టీలు ఎన్నికలలో తప్ప నీ సంగతేం పట్టించుకోవు. కారణం వాటికి కావలసింది అధికారం, ధన సంపాదన తప్ప నీ మంచి చెడ్డలతో పనిలేదు. కాబట్టి నీవేం చేయాలి? బీదలంతా కుల, మతాలను విడిచి ఏకం కావాలి. మన బతుకుని దైవానికి, మతానికి, కులానికి, రాజకీయ పార్టీలకు అప్పచెప్ప వద్దు. పేదలు నిర్మాణయుతంగా సంఘటితపడి సమస్యలు పరిష్కరించుకోవాలి.

**మతము, దేముడు ఏమి చెపుతున్నాయి? చేస్తున్నాయి?**

ఈ సృష్టి యావత్తూ దైవకృపచే జరిగింది. యావత్తు జగత్తు దైవంచే నడిపించబడుతోంది. దానిలో భాగమైన నీ కష్టాలకు, సుఖాలకు కారణం దైవం మాత్రమే. కాబట్టి నీవు చేయవలసింది ఏమీ లేదు. నీవు నిమిత్తమాత్రుడవు, అని మతం ద్వారా చెప్పించుట వలన వ్యక్తిలోనూ, సమాజంలోనూ 1) లొంగుబాటు తత్వం – బానిసత్వం 2) సమాజం, ఎలాపోతే నాకెందుకులే అనే అలసత్వ (పట్టించుకోని) తత్వం 3) పరిస్థితులకు సరిపుచ్చుకొనిపోయే తత్వం 4) మన వల్ల ఏమీ కాదు, ఏమీ చేయలేం అన్న నిస్పృహ దోపిడీ పాలకవర్గాలచే ప్రవేశపెట్టబడి బలీయ మొనర్చబడింది. ఇది కేవలం తాత్వికంగానే కాకుండా రాజకీయ, ఆర్థిక సామాజిక రంగాలలో బలంగా పాతుకొనిపోయింది. ఇదే నేటి మన పేద ప్రజల దురవస్థకు మూలం. ఈ నాల్గు అంశాలే సమాజంలోని బడుగువర్గాల ప్రగతికి, సోషలిస్టు విప్లవానికి శ్రామికవర్గం సిద్ధం కాకుండా అవరోధించుటకు తరతరాలుగా కొనసాగించబడుతున్నాయి. హింసా రాజకీయాలవైపు మళ్ళించుతున్నాయి. అందుకే శ్రామికవర్గం, శ్రామిక వర్గేతర చైతన్యం, సంస్కృతి – భూస్వామ్య పెట్టుబడిదారీవర్గ చైతన్యాన్ని, సంస్కృతిని కలిగి వుండుటచేతనే నిర్మాణాత్మక విప్లవ పోరాటం వైపు పయనించలేకపోతున్నారు. ఆధ్యాత్మికవాదం మోక్షాన్నో, స్వర్గాన్నో ఇవ్వలేదు. మనిషిని

మనిషి మోసం చేసేది, మానసికంగా హింసించగల్గేది, కృంగదీయగల్గేది అయిన సంస్కృతిని మాత్రమే ఇవ్వగల్గింది, ఇస్తోంది, ఇవ్వబోతున్నది ఆస్తికత్వం. కాబట్టి ఆధ్యాత్మికవాదం పాలక వర్గాలకు అనుకూలం. పాలిత, పీడిత, అణగద్రొక్కబడిన వర్గాలకు, ప్రజలకు ఆగర్భశత్రువు.

**నాస్తికత్వం ఏమి చెపుతోంది? ఏమి సాధించుతుంది?**

యావత్తు విశ్వం ఎవ్వరిచేత సృష్టించబడలేదు. పదార్ధానికి, అపదార్ధానికి (పదార్ధం లేని ఖాళీ ప్రదేశం) మధ్య ఆదిలో జరిగిన ఘర్షణతో విశ్వమంతయు పదార్థమయం అయింది. వివిధ పదార్ధాలలో ఇమిడి వున్న నిర్ధిష్ట వైరుధ్య సూత్రాల వల్ల ఆ పదార్థం కోట్లాది సంవత్సరాలుగా మారుతూ నేటి స్థితికి వచ్చింది. అనంత విశ్వంలో ఈనాడు పదార్థం లేని ఖాళీ ప్రదేశం అంటూ లేదు. యావత్తూ పదార్థమయమే అనేది పరిశోధనల సారాంశం. విశ్వంలో అంతర్భాగమైన భూమి, ప్రకృతి, జీవజాలం, మానవులు వేల కోట్లాది సంవత్సరాలుగా జరుగుతూ వచ్చిన మార్పులు యొక్క ఫలితం. ఈ మార్పులలో కొన్ని పరిమాణం రీత్యాను, మరికొన్ని గుణాత్మకంగానూ మారినాయి. ఇలా ఏర్పడిందే నేడు మనం జూస్తున్నదంతా. అంతేకానీ ఎవ్వడూ దీన్ని సృష్టించలేదు. తయారుచేయలేదు. “నేనే సృష్టించానని ఏ దేవుడు, దెయ్యం చెప్పలేదు. దేవున్నీ, దెయ్యాన్నీ సృష్టించింది మనిషే”. దైవభావాన్ని భయాన్ని, పిరికితనాన్ని, బానిసత్వాన్ని లొంగుబాటుతనాన్నీ, పట్టించుకోని తత్వాన్ని, స్వార్థాన్ని మనలో ప్రవేశపెట్టింది మతం. మతం పాలకవర్గాలచే సృష్టించబడింది. దోపిడీ కొనసాగడానికి, పీడన, తాడనలను సాత్వికంగా ప్రజలపై రుద్దడానికి ఆచారాలు, సంప్రదాయాలు, కుల మత దైవాలు వుపయోగ పడుతున్నాయి. మనలో ఐక్యత లేకుండా చేస్తున్నాయి. సరియైన శాస్త్రీయ దృక్పథం, సామాజిక అవగాహన లేకుండా చేస్తున్నాయి. మన ఆలోచన, ఆచరణలలో ప్రాచీనకాలం నాటి మత గ్రంథాల, పురాణాల జ్ఞానాన్ని బలీయంగా ప్రవేశబెట్టబడడం సామాన్య విషయం. కాబట్టే ఓ మనిషీ నీవు నిత్య పీడనకు – ఆర్థిక, రాజకీయ సామాజిక దోపిడీకి గురి అవుతున్నావు. నీలో బానిస లక్షణాలను, అలసత్వాన్ని, పరిస్థితులకు లొంగిపోయే తత్వాన్ని తొలగించుకోవటానికి నాస్తికత్వం రాచబాట.

**నాస్తికత్వం ఏమి సాధించుతుంది?**

ఆర్థికదోపిడీ లేని ఉత్పత్తి సంబంధాలను ఏర్పరచుతుంది. దోపిడీ ఏ రూపంలో వున్నా కూకటి వేళ్ళతో పెకలించివేసి అందరి మధ్య సమాన అవకాశాలు గల్గిన సమాజాన్ని ఏర్పరచుతుంది. సాంఘిక దోపిడి లేని సమాజాన్ని నిర్మించుతుంది. ప్రజలందరి మధ్య సోదరభావాన్ని సృష్టిస్తుంది. ఒకరికింత పెట్టి ఇతరుల కష్టాల్లో పాలుపంచుకొనెడి వాస్తవిక సాంస్కృతిక చైతన్యాన్ని సుస్థిరం చేస్తుంది. పురాణ విజ్ఞానానికి బదులు శాస్త్రీయ విజ్ఞానాన్ని సమాజపరం చేస్తుంది. దైవ, మత, కుల భావాలు, అది సృష్టించిన తేడాలు, అగాధాలు రూపుమాస్తాయి. మహోన్నతమైన మానవత్వ విలువలను ఏర్పర్చి బలపడేందుకు కారణమౌతుంది. అసమానతలను రూపుమాపి సమానత్వాన్ని అన్ని కోణాలలో, స్థాయిలలో ఏర్పర్చగలిగేది నాస్తికత్వం. మనిషిలో మానవత్వ విలువలను పెంచుట ద్వారా మనిషిగా మలచగల్గేది నాస్తికత్వమొక్కటే. నీకు జన్మ ఇచ్చిన తల్లి (స్త్రీ) ని, సోదరిని, బిడ్డను అతినీచంగా చూడమని జెప్పే మతశాస్త్ర స్థానంలో స్త్రీ జాతికి సంపూర్ణ స్వేచ్ఛా హక్కులను, సమానత్వాన్ని శాస్త్రీయంగా, విజ్ఞానపరంగా సమాజంలో ఏర్పర్చగల్గిన శక్తిగలది నాస్తికత్వమొక్కటే.

**– చార్వాక రామకృష్ణ**

# నాస్తిక చతురోక్తులు

శివశేఖర్ కాలెపు

ఆకలికి
కులం మతం వుండవు
ధనిక పేదల భేదాలు వుండవు
ఆకలేస్తే ... ...
ధనికుడు ధనం తినలేడు
పేదోడు కన్నీళ్ళు మ్రింగలేడు
కులం మతం
ఆఖరికి ఆ కల్పిత దేవుడు సైతం
ఏ కంచంలోనూ ఒక్క మెతుకు
విదల్చలేడు!

స్వామీజీలు బాబాలుగా
చెలామణీ ఔతున్న చాలా మంది
కాషాయం కప్పుకున్న మోసగాళ్ళు
ప్రజలను నిలువెల్లా దోచుకునే దొంగలు!

దేవుడు అనే పదాన్ని సృష్టించింది
ఎవడోగానీ, ఈ మూడు అక్షరాలతో
కొన్ని యుగాలుగా మనుషుల్ని
అంధకార అగాధంలోకి నెట్టి వేశాడు
మెదడు ఎదగనీయకుండా
అజ్ఞానం వైపు పయనింప చేశాడు!

ఈ దేశంలో
మతగ్రంథాలు చదివినంత భక్తిగా
వైజ్ఞానిక పుస్తకాలు చదవలేరు శ్రద్ధగా
మత గ్రంథాల్లో అన్నీ అవాస్తవాలే వుంటాయి
సైన్స్ పుస్తకాల్లో అన్నీ వాస్తవాలే వుంటాయి!

నాస్తికత్వం
హేతువాదం
ఈ రెండూ సమాజాన్ని
ఆలోచింప చేస్తాయి

ఆస్తికత్వం
మూఢనమ్మకం
ఈ రెండూ సమాజంలో
ఆలోచన్లని నశింప చేస్తాయి
చీకట్లో దెయ్యాలు భూతాలు వుంటాయని
భయం పోవాలంటే ఆంజనేయస్వామి
దండకం చదువుకోమన్నారు
అసలు!
రామాయణంలో ఆంజనేయుడు
దెయ్యాల్ని భూతాల్ని
పారద్రోలిన ఘట్టాలే లేవు కదా
మరీ! దండకం గోల ఏల?

మత గ్రంథాలు
దైవ లిఖితాలు అని నమ్మేవాళ్ళు
మానసిక రోగులు
మెదడు లేని శూన్యులు
దేవుడు వున్నాడనే
భ్రాంతితో బ్రతుకుతూ
ఆ రాతి ప్రతిమలకు
నిత్య బానిసలు!

భక్తి కూడా ఒక వైరస్ లాంటిదే
అది మనుషుల్ని చంపదు
వారి....
మెదళ్లను మాత్రమే హత్య చేస్తుంది!

దేశంలో
మేధావులు సైంటిస్టులు
కరువైపోయారు
కారణం...
99% ఆస్తికులు వున్నారు కనుక!

టి.వి ఛానళ్ళు
ఎవడో స్వామీజీని
ఒహో అంటాయి
ఎవడో బాబాని
అహో అంటాయి
ఎవడ్నో దేవుడ్ని
ఒహో అహో అంటాయి
ప్రజా సమస్యల్ని ప్రసారం చేయకుండా
అభూత కల్పన దేవుళ్ళకి
తెగ ప్రచారం చేసేస్తుంటాయి!

ఈ దేవుడి రోజు వారీ ఆదాయం యింత
ఆ దేవుడి ఆదాయం అంత అంటూ
స్క్రోలింగులు యిచ్చే టి.వి వాళ్ళు
సగటు మనిషి దారిద్ర్యపు రేఖకు
ఇంత దిగువన వున్నాడని
స్క్రోలింగులు ఎందుకు యివ్వరు?

వెంకన్న సాయి క్రీస్తు అల్లా
ప్రతి దేవుడికొక భక్తి ఛానల్
ఎవర్ని వుద్ధరించడానికి
భక్తిని మానవ శరీరాల్లోకి
ఇంజెక్ట్ చేసి, కళ్ళకు మైకపు పొరల్ని కప్పి
దేవుడి పేరిట ఆదాయ వనరుల్ని
సమకూర్చుకోవడానికే యివి!

ఏ మత విశ్వాసకులైనా
మరణిస్తే, వారి తాలూకూ దేవుళ్ళు
సంతాపం తెలపరు

సాటి మనిషి మాత్రమే స్పందిస్తాడు
స్వర్గలోకం పరలోకం పవిత్రలోకం
అనేవి లేనేలేవు
మరణానంతరం ప్రాణం పోతుందేగానీ
వేరే లోకాలకు వెళ్ళిన దాఖలాలు లేవు!

దోపిడీలకు అనువైన ప్రదేశాలు
దేవాలయాలు
అందుకే.....
హుండీలు నగలు తరుచూ
చోరీలకు గురౌతుంటాయి
కారణం...
అక్కడ దేవుడు లేడని దొంగలకు
తెలుసు కనుక!

మనిషి
రాతి యుగంలోంచి
ఆధునిక యుగంలోకి వచ్చినా
ఇంకా....
రాళ్ళకు మ్రొక్కుతూ మానసికంగా
రాతి యుగంలోనే వుండిపోయాడు!

పేదరికం ఆకలి నిరుద్యోగం
హత్యలు అత్యాచారాలు ఆత్మహత్యలు
నిరంతరం క్రీడలుగా మారిపోయాయి
ఏ దేవుడూ...
ఆపే ప్రయత్నాలు చేయడు!

ఉడుత సాయం చేసిందని
దాని వీపుపై గీతలు గీసాడట
మొత్తం వారధినే నిర్మించిన వానరులపై
ఎందుకు గీయలేదు?

మత గ్రంథాల్లో వున్న
శాంతి ప్రవచనాలు
వినడానికి తప్ప
ఆచరణకు పనికిరావు!
దేవేరుల శిలలకు
పరాయి వాడు వలువలు విప్పి
మరలా కట్టడం ఏమిటి

వారి భర్తలైన దైవములు
ఏమీ అనుకోరా?
చలనం లేని రాతిబొమ్మలకు
శింగారాలు శృంగారాలు ఏల?

గోవుల మూత్రం
పవిత్రమంటున్నారు
ఔషధమంటున్నారు
రోగాలు పోతాయంటున్నారు
ఆంబోతు, ఎద్దు
ఆ కేటగిరీకి చెందినవే కదా
వాటి మూత్రం పవిత్రమైనది కాదా?

ఏ మతం అయితే
ఆచారాలు పేరిట మనిషి
స్వేచ్ఛను హరిస్తుందో
గొంతు నొక్కి వేస్తుందో
కాళ్ళకు సంకెళ్ళు వేస్తుందో
అది మతం కాదు
విషపు ఊబి!

కులాల పరిధిలో వున్న వాళ్ళు
మతాల మత్తులో తూలే వాళ్ళు
దైవం భ్రమల్లో భజన్లు చేసే వాళ్ళు
వీళ్ళ మెదళ్లలో
అజ్ఞానం తప్ప విజ్ఞానం వుండదు
వీళ్ళంతా సమాజానికి పెను ప్రమాదకారులు!

ఆ మతం వారు
కొన్ని సమాధులను
దైవాలుగా భావించుకుంటారు.
మరణించిన వారికి
ఏవేవో మహత్తులు వున్నాయనుకోవడం
ఒక భ్రాంతి ఒక పిచ్చి భ్రమ మాత్రమే!

మత గ్రంథాల పుటల్లో
యుగ యుగాలుగా
దేవుడు దాగి వున్నాడట
ఆ గ్రంథాలకు చెదలు పట్టి
యేళ్ళు యేళ్ళు గడిచిపోతున్నాయి
అవి ఎన్నటికైనా చెత్త బుట్టల్లోకి
విసిరి వేయవలసిందే!
ఏసు నామము ఏసు నామము
అని స్తుతించెదరు
నామము అనే పదం
హిందువులది కదా
మధ్యలో ... ...
ఏసుకి యీ నామము
పెట్టింది ఎవరు?

రాత్రికి రాత్రే సప్త సముద్రాలను
ఏసు తన పారతో తవ్వెను!
అంత మట్టిని
ఎక్కడ పారపోశాడో తెలీదు
అంతటి నీటిని
ఎక్కణ్ణుంచి తీసుకు వచ్చాడో తెలీదు
ఈ అనుమానాస్పదమైన ప్రశ్నలకు
జవాబులు యివ్వగలరా?

దైవ కుమారుడికి
బైబిల్ వ్రాయడానికి 1500
సంవత్సరాల సమయం పట్టింది
బైబిల్ వ్రాయక ముందే ఏసు మరణించాడా
లేక వ్రాసిన తర్వాత హత్య చేయబడ్డాడా?
ఎవరు జవాబు చెప్తారు?

ఏసు తన రక్తంతో
పాపులను పరిశుద్ధులను చేయును
రక్తాన్ని యితరుల శరీరానికి పూస్తారా
ఇదేం వాక్యం జుగుప్సాకరంగా!
నీ వద్ద ఎన్ని లీటర్ల రక్తం వుంది ఏసయ్యా?

రెండో రాకడ... ....
రెండు యుగాలుగా చెప్తున్న అబద్ధపు మాట!
పరలోకంలో అంత బిజీగా వున్నావా ఏసయ్యా
ఇంకా ఎన్నాళ్ళీ మోసపూరితమైన వాక్యాలు
చెప్తున్న పాస్టర్లు దశమ భాగంతో
సంపన్ను లౌతున్నారు
వింటున్న వారు సంపదను
పోగొట్టుకుంటున్నారు!

నేను పాపిని అని చర్చీలకు వెళ్ళి
మొర పెట్టుకోవడం ఏమిటి?
పాపుల కోసం దేవుడు
మరణించడం ఏమిటి?
మరణించిన దేవుడు
ఒక్కడే సత్యవంతుడా?
ఐతే! మనుష్యులంతా పాపులేనా!?

---

# హేతువాదం అంటే ఏమిటి?

**- మా.శ్రీ.రాజు**

**హే**తువు అంటే కారణం. వాదం అంటే వాదించటం. హేతువాదం అంటే కారణం తెలుసుకోవటం కోసం వాదించటం.

వాదించటం వల్లే అజ్ఞానం పోతుంది. విజ్ఞానం కలుగుతుంది. కారణం తెలుస్తుంది. అది సరైన కారణమా, కాదా అన్నది కూడా గ్రహించగలుగుతాం.

సరైన కారణమయితే శాస్త్రీయ విజ్ఞానం అవుతుంది. సరైన కారణం కాకపోతే అశాస్త్రీయ అజ్ఞానం అవుతుంది.

శాస్త్రీయ విజ్ఞానమయితే నమ్మొచ్చు. పాటించవచ్చు. సరైన ఫలితాలు పొందవచ్చు. అశాస్త్రీయ అజ్ఞానమయితే గుడ్డిగా, నమ్మకుండా మూర్ఖంగా పాటించకుండా దాన్ని వదిలించుకోగలుగుతాం. మత ఛాందసవాదం విడవగలుగుతాం. దేవుడనే బూచిని తొలగించుకోగలుగుతాం. వాళ్ళ నిలువు దోపిడి నుంచి బయటపడగలుగుతాం.

ఫలితంగా ఎంతో విలువైన కాలం, ధనం వృధాకాకుండా కాపాడుకోగలుగుతాం. విలువైన కాలాన్ని వృధాకాకుండా కాపాడుకోగలగటం వల్ల, కాలం విలువ తెలుసుకొని, కాలంతో ముందుకు సాగటం వల్ల, ఎన్నో విజయాలు స్వంతం చేసుకోగలుగుతాం. విలువైన ధనం వృధా కాకుండా కాపాడుకోగలగటం వల్ల, మనకి, మన కుటుంబానికి, సమాజానికి వినియోగించుకోగలుగుతాం.

మనకి, మన కుటుంబానికి, విలువైన కాలం, విలువైన ధనం వినియోగించటం వల్ల, ఆయురారోగ్యాలతో, అభివృద్ధితో వర్ధిల్లుతాం. సమాజానికి వినియోగించటం వల్ల సమాజం బాగుపడుతుంది. సమాజంలో మనకి మంచిపేరు వస్తుంది.

కాబట్టి, శాస్త్రీయ విజ్ఞానం కలిగించే హేతువాదం అందరికీ అవసరం. అందుకే అందరూ హేతువాదులు అవ్వాలి.

# ఆదిమానవుల సైన్స్

**– డా॥ కొడవటిగంటి రోహిణీ ప్రసాద్**

విజ్ఞానం ఏ ఒక్కరి సొత్తూ కాదు, సమష్టిగా రోజువారీ జీవితాల్లో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కుంటూ, ప్రకృతిని గురించి నలుగురికీ పనికొచ్చే సమాచారాన్ని పోగుచెయ్యడం, దాన్ని విశ్లేషించి సత్యాలను రూఢిగా తెలుసుకోవడం మొదలైన ప్రయత్నాలు తొలి మానవ సమాజాలన్నీ చేస్తూనే వచ్చాయి. ఇలా పోగుపడిన సమాచారమే రాబోయే తరాలు కనిపెట్టిన విషయాలకు పునాది అయింది. ఈ విషయాలన్నిటికీ ఎడతెగని సంబంధం ఉండేది. విజ్ఞానమంటే సక్రమంగా వ్యవస్థీకరించబడిన సమాచారమే గనక మొదట్లో అస్పష్టంగా గోచరించిన విషయాలే ఎన్నో తరాలపాటు పరిశీలనలు జరిపిన మీదట జీవితసత్యాలుగా నిర్ధారణ అయ్యాయి.

ప్రకృతిలోని చెట్లు, చేమల మధ్య తిరిగే జంతుజాలంలో ఒకటిగా ఆవిర్భవించిన మానవజాతి వానరదశను దాటి ఎంతో ఎదిగింది. క్రమంగా మనుషులకూ తక్కిన జంతువులకూ మధ్య పూడ్చలేని ఎడం ఏర్పడసాగింది. చిన్న గుంపులుగా, సముదాయాలుగా సమాజ జీవితం మొదలుపెట్టి, గుహల్లో తల దాచుకుంటూ, సంచార జీవితాలు గడిపిన తొలిమానవులకు సైన్స్‌తో సంబంధం ఏమిటనిపిస్తుంది కాని, ఆటవిక, బర్బరదశలలోనే మనుష్యులు నిత్యమూ ప్రకృతిని పరిశీలించడం అలవాటు చేసుకున్నారు. తాము తెలుసుకున్న విషయాలను సాటివారితో పంచుకున్నారు. తక్కిన జంతువులన్నీ తమ తమ శరీర లక్షణాలను బట్టి ఏవో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయాయి. కాని మనుషులు మాత్రం ధైర్యంగా నివాసయోగ్యం కావనిపించిన ప్రాంతాలకు కూడా వెళ్ళి స్థిరపడగలిగారంటే అందుకు కారణం వారి పరిశీలనాశక్తీ, తెలివితేటలూ పనికొచ్చాయి గనకనే.

నిప్పు చేసినా, రాతి పనిముట్లు చేసుకున్నా, చలి ప్రాంతాల్లో జంతువులు చర్మాలు కప్పుకోవడం నేర్చినా, ఇవన్నీ మనుషులకు అలవడిన ప్రత్యేక లక్షణాలు. ప్రాణాలు దక్కించుకునేందుకూ, తమ సాటివారికి కూడా పనికొచ్చేందుకూ ఈ విద్యలన్నీ అతి ప్రాథమిక స్థాయిలో తొలి మానవులకు ఉపయోగపడ్డాయి. ఏ దశలో మొదలైందో సరిగ్గా తెలియదుగాని, తమకన్నా చాలా పెద్దవైన మేమత్, ఏనుగు వంటి జంతువులను కలిసికట్టుగా తమకన్నా వేటాడడంలో మాటలు మాట్లాడగలగడం మనుషులకు ఎంతో సహాయపడింది. ఇక ఆ తరువాత సామూహికంగా పోగైన సమాచారాన్నంతా జ్ఞాన విజ్ఞాన రూపాల్లో మనుషులు తమ సంతతికి అందించగలిగారు. చావు తప్పించుకునే మార్గం ఎటువంటిదైనా అది వారి పాలిటికి విజ్ఞానమే.

రాతి పనిముట్ల తయారీ ఒక్కటే మానవజాతిని చాలా ముందుకు నెట్టింది. ఏ రకం రాయి ఎటువంటి ఆయుధానికి పనికొస్తుందో, అలాంటివెక్కడ దొరుకుతాయో, దాన్ని ఒడుపుగా ఎలా చెక్కాలో వగైరాలన్నీ ఆనాటి ఉన్నత శాస్త్రాలై ఉంటాయి. నిప్పుకు ఎంతటి క్రూరజంతువైనా జడుస్తుందనీ, ఏ బురద గుంటలోకో ఉపాయంగా నెట్టగలిగితే ఎంతటి మృగమైనా నిస్సహాయస్థితిలో తమకు ఆహారం కాగలదనీ గ్రహించటం వారికి మేలు చేసింది. తాము వేటాడే జంతువులను ఆయువుపట్టు మీద కొట్టడం, చర్మాన్ని ఒలవడం, మాంసాన్ని నిప్పుల మీదనో, ఉప్పుతోనో నిలవ ఉంచడం, సాటివారి గాయాలకు ప్రాథమిక చికిత్స చెయ్యడం, ఏయే ప్రాంతాల్లో ఎప్పుడెప్పుడు ఎటువంటి

జంతువులు, తినదగినవీ, తినదగనివీ దుంపలూ, ఫలాలూ దొరుకుతాయో తెలుసుకోవడం, రుతువులను బట్టి ఎటువంటి ప్రాంతాలకు వెళ్ళడం శ్రేయస్కరమో గమనించడం ఇలాంటి వివరాలన్నీ నలుగురూ పంచుకునే వారని ఊహించవచ్చు. ఇది విజయవంతంగా జరిగిందనడానికి సాక్ష్యం మనమే. మానవుల జనాభా ఇటువంటి విజ్ఞానం సహాయంతోనే ఇంతగా పెరగగలిగింది.

ఇదంతా ఖచ్చితంగా ఎలా జరిగిందనడానికి సాక్ష్యాలేవీ లేవుగాని ఫ్రాన్స్ దక్షిణ ప్రాంతంలోని కొన్ని గుహల్లో 32 నుంచి 11 వేల ఏళ్ళ క్రితం గీసిన కుడ్యచిత్రాల గురించి 1860 ప్రాంతాల్లో తెలిసింది. అద్భుతమైన ఈ చిత్రకళ ద్వారా అప్పటివారి గురించి కొంత తెలుస్తోంది. తాము వేటాడుతున్న జంతువులపట్ల కృతజ్ఞతాభావంతోనో, భక్తిభావంతోనో ఈ బొమ్మలు గీసి ఉంటారని పరిశోధకులు ఊహిస్తున్నారు. బొమ్మలకు వారు జరిపే తంతులన్నీ నిజ జీవితంలో అవి ఎదురైనప్పుడు ఫలితాలనిస్తాయని అమాయకంగా నమ్మేవారేమో కూడా. ప్రవేశించడమే కష్టమనిపించే ఇటువంటి చీకటి గుహల్లో సామాన్యంగా శబ్దాలు బాగా ప్రతిధ్వనిస్తాయని గుర్తించాక ఈ బొమ్మలకు మంత్రతంత్రాల ఉచ్చారణతోనూ, ఆదిమపూజలతోనూ సంబంధం ఉండి ఉంటుందనే ప్రతిపాదనలూ వచ్చాయి. ప్రాచీన ఆరాధనా స్థలాలుగా అనిపిస్తున్న గుహల్లోనూ, ఇంగ్లండ్లోని స్టోన్‌హంజ్ వంటి నిర్మాణాల్లోనూ శబ్దాలు బాగా మారుమోగుతాయనేది ఆధునిక పరిశోధనల్లో వెల్లడౌతోంది. అప్పట్లో ప్రతిదీ మనుషులకు సంభ్రమాశ్చర్యాలు కలిగించేది గనక మారుమోగే చప్పుళ్ళకు కూడా ప్రాచీనులు అతీతశక్తులను ఆపాదించి ఉండవచ్చు. గారడీకీ, మంత్రాలకూ భేదం లేని ఆ రోజుల్లో ఒకే శ్రుతిలో గణాచారి చేసే శబ్దాలన్నీ ఇలాంటి గుహల్లో రెసొనెన్స్ ద్వారా బలపడి గట్టిగా వినిపించి ఉంటాయి. (మంత్రాల ఉచ్చారణకు ఇప్పటికీ మన దేశంలో ఎంతో శక్తిని ఆపాదించడం చూస్తూనే ఉన్నాం) దినదిన గండంగా బితుకు బితుకుమంటూ బతికిన అప్పటి ప్రజలను ఇటువంటి సామూహిక ప్రార్ధనలూ, సమావేశాలూ ఏకం చేసి ఉంటాయి. వారి ఐకమత్యం పరస్పర సహకారాన్ని పెంపొందించి, జీవితకాలాన్ని పొడిగించి ఉంటుంది కనక ఇటువంటి ప్రాంతాలని కనిపెట్టడం కూడా ఒక సైన్సే.

ఆ కాలంలో మనుషులను బాగా ప్రభావితం చేసిన మరొక విషయం స్త్రీల సంతానోత్పత్తి. తమ తెగలను జంతువుల, ప్రకృతిశక్తుల బారిన పడి అంతరించిపోకుండా కాపాడగలిగినది సంఖ్యా బలమేనని వారు గుర్తించారు. సంతానోత్పత్తి సామర్ధ్యానికి ప్రతీకలైన ఆ యుగపు 'అమ్మ తల్లి' బొమ్మలు చాలా దొరికాయి. నాలుగైదు అంగుళాల నిడివి కలిగిన ఈ బొమ్మలను చేత పట్టుకుని ఏవో తంతులు జరిపేవారని పరిశోధకులు ఊహిస్తున్నారు. మన దేశంలోనూ తవ్వకాల్లో లభించిన ఇటువంటి బొమ్మలు మాతృస్వామ్య భావనకు సంకేతాలుగా కనిపించాయి. సంతానోత్పత్తికి స్పష్టమైన మరొక సంకేతం మన దేశంలో అనాదిగా పూజింపబడుతున్న లింగరూపం. ఇదంతా సైన్స్ అంటే హాస్యాస్పదంగా అనిపించవచ్చు గాని తమ మనుగడకు మేలు జరుగుతుందని నమ్మిన అప్పటి ప్రజలు ఈ తంతులన్నీ విధిగా సమాజ శ్రేయస్సు కోసమే జరిపారు. మతం పేరుతో అల్పసంఖ్యాకులు ఇతరులను మభ్యపెట్టే దశ అప్పటికింకా ప్రారంభం కాలేదు.

అలంకారార్ధం మెడలో ధరించిన పూసలూ, ఎముకలేకాక, కొన్ని మేమత్ ఏనుగు దంతాల మీదా, ఎముకల మీదా చెక్కిన, లేదా గీసిన కొన్ని బొమ్మల్లో చంద్రుడి కళలూ, నక్షత్రాల విశేషాలూ కనిపించాయి. అవి అప్పటి ఖగోళశాస్త్ర వివరాలు అయి ఉంటాయి. ఆకాశాన్ని నిశితంగా

పరిశీలించి, రుతువులను బట్టి జరిగే మార్పులను నమోదు చేశారనడానికి ఇది సాక్ష్యం. పని గట్టుకుని ఈ పని చేశారంటే ఆ వివరాలు వారి నిత్యజీవితాలకు ఉపయోగపడినవే అయి ఉంటాయి. ఎందుకంటే సూర్యుడి వల్ల వేడిమీ, వెలుతురూ కలుగుతాయనీ, చంద్రుడివల్ల వెలుతురు మాత్రమే లభిస్తుందనీ, ఇవన్నీ తూర్పున ఉదయించి, పడమట అస్తమిస్తాయనీ వారు గమనించారు.

మబ్బులూ, ఉరుములూ, మెరుపులూ, వానా, మంచూ, వడగళ్ళూ ఎక్కడెక్కడ ఎప్పుడెప్పుడు కురుస్తాయో తెలుసుకోవడం వారికి చాలా అవసరమయింది. చీకట్లో దారి తప్పినవారికి కొన్ని నక్షత్రాలు తోడ్పడతాయని వారు గ్రహించారు. ఈటెలూ, రాళ్ళూ విసిరినప్పుడు ఎంతెంత దూరం పోతాయో, విల్లమ్ముల సైన్స్ ఎటువంటిదో వారికి చాలా విషయాలు నేర్పి ఉంటాయి. అలాగే నీటి లక్షణాలూ, అందులో మునిగేవి, తేలేవీ వివిధ వస్తువుల గుణాలూ, జలచరాల విశేషాలూ వగైరాలన్నీ తెలుసుకోవడం అప్పట్లో ఒక గొప్ప శాస్త్రం వంటిదే.

తమ శరీరాలకు తగిలే గాయాలూ, అప్పుడప్పుడూ వచ్చే రోగాలూ, తప్పనిసరిగా వచ్చే ముసలితనమూ, చావూ మొదలైనవన్నీ వారి అవగాహనకు వచ్చి ఉంటాయి. ఆధునిక హోమో సేపియన్స్ జాతి ఆవిర్భవించక మునుపే శవాలను ఖననం చేసే ఆచారం మొదలైంది. కనక చావు బతుకులను గురించి మనుషులకు ఏనాడో తెలిసి ఉంటుందనుకోవచ్చు. ప్రసూతిలో జాగ్రత్తలూ, పిల్లలని జాగ్రత్తగా పెంచి, పోషించడం మనుషులు నేర్చుకున్నారు. లైంగికపరమైన భావాలూ, వాటివల్ల కలిగే సామాజిక పరిణామాలూ, మనుషుల మధ్య అప్పుడప్పుడూ తలెత్తే వివాదాలూ మొదలైనవన్నీ తరవాతి యుగంలో ఏర్పడిన స్థిరజీవితాల సామాజిక స్వరూపాన్ని ప్రభావితం చేశాయి. ఇదంతా సైన్స్ కాదని ఎవరూ అనలేరు. పుస్తకాలూ, స్కూళ్ళూలేని ఆ కాలంలో చిన్నతనం నుంచీ చావు బతుకులను నిర్ణయించే రోజువారీ సమాచారాన్ని తెగలోని పెద్దలను చూసి నేర్చుకోవడం ఎంత ముఖ్యంగా ఉండేదో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ రోజుల్లో సైన్స్‌తో పరిచయం లేకుండా మన జీవితాలు వెళ్ళమారిపోగలవేమో కాని ఆదిమయుగంలో మాత్రం ప్రతివారికీ ఈ విషయాలన్నీ తెలిసి ఉండడం చాలా అవసరమయ్యేదని ఊహించవచ్చు.

మొదట్లో సమష్టిగా మానవశ్రేయస్సుకు ఉపయోగపడిన ఈ విజ్ఞానమంతా క్రమంగా ప్రజాస్వామికతను కోల్పోయింది. షామాన్లూ, గణాచార్లతో మొదలైన మత వ్యవస్థ సామాన్య ప్రజలకు ఉండిన జ్ఞాన అవసరాలను వెనక్కునెట్టేసి, వారికి సహజంగా ఉండే అయోమయాన్ని ప్రోత్సహించింది. వర్గవ్యవస్థ పుంజుకున్నాక, ప్రశ్నించే వైఖరిని అణగదొక్కడం ఉద్యమం స్థాయికి చేరుకుంది. మన దేశంలో వర్ణాల, కులాల ప్రాతిపదిక మీద ఎక్కువమంది జ్ఞాన సముపార్జనకు అనర్హులుగా పరిగణించబడ్డారు. కర్ణుడికి గురువిచ్చిన శాపం కథ తెలిసినదే. అధిక సంఖ్యాకులు గుడ్డి నమ్మకాలను వదులుకోలేక అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతూ, వెనకబడిన వర్గాలుగా నేటికీ కొనసాగుతున్నారు. సైన్సూ, విజ్ఞానమూ బడుగువారికి అందుబాటులో లేకపోవడం యాదృచ్ఛికం ఎంత మాత్రమూ కాదు. ఆదిమానవులు తమకు తెలిసిన సైన్సుతో సహా ఉన్న వాటన్నిటినీ అందరూ సమానంగా పంచుకుని విజయవంతమైన జీవితాలు గడిపారు. ఇరవయ్యొకటో శతాబ్దంలో ఒక వంక రోదసీ విజయాలూ, అణుశక్తి సామర్థ్యమూ ఉండగా మరొక వంక ముడుపులూ, మొక్కులూ, బాణామతి వగైరాలతో ప్రజలు సతమతం అవుతున్న ఈనాటి పరిస్థితులు కృత్రిమంగా సృష్టి అయినవే.

# క్రైస్తవ మతం మూలాలు (The roots of Christianity)

(గత సంచిక తరువాయి)

– డా॥ ఆర్.కె

## జూడియాలో మత, రాజకీయ సంఘాలు

యూదుమతం ఏక శిలా సదృశ్యంకాదు. యూదులు ఒకే వర్గంగా లేరు. ఆస్తులు, అంతస్తులు, ఆలోచనలలో ఎన్నో తేడాలున్నాయి. ప్రఖ్యాత యూదుచరిత్రకారుడు జోసిఫస్ జూడియాలో ప్రధానంగా మూడు మత, రాజకీయ గ్రూపులను గుర్తించాడు. అవి సద్యూసిస్‌లు, ఫారిసీస్‌లు, ఎస్సెనెస్‌లు. పైకి మతపరంగా కనపడినా, నిజానికి అవి జూడియా సమాజంలోని విభిన్న సామాజిక, ఆర్థిక రాజకీయ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

సెద్యూసిస్‌లు (Sadducees) – రెండవ శతాబ్దం నుండి జెరూసలెం దేవాలయానికి సెద్యూసిస్‌లే పూజారులు, మతాధిపతులు. దేవాలయ నిర్వహణ అంతా వారిదే. డేవిడ్‌రాజు కాలంలో మొదటి జెరూసలెం దేవాలయం ప్రధాన పూజారి జోడెక్ వారసులమని చెబుతారు. జన్మతా వచ్చిన వారసత్వ హక్కుతో గుడి ఇంటా, బయటా తమ ఆధిపత్యం కొనసాగాలని కోరుకుంటారు.

దేవాలయంలో అధికారికంగా 1500 మంది పూజారులున్నారు. వీరిలో అరడజను కుటుంబాలదే గుడి పెత్తనమంతా. వీరికి బాడిగార్డులు, సేవకులు వుంటారు. గుడిపన్నులు, ఇతర ఆదాయ వనరులన్నీ వీరి ఆధీనంలోనే వుంటాయి. దేశ, విదేశాలలోని యూదుల నుండి వెండి, బంగారు బహుమతులొస్తాయి. పండుగలలో జంతు బలులు వుంటాయి. ధనం ప్రవాహంలా గుడిని ముంచెత్తుతుంది. దేవుడి సొమ్ము అత్యధికభాగం పాలకులు, పూజారుల కైంకర్యమవుతుంది. ఆలయం వడ్డీ వ్యాపారానికి, దోపిడీకి నిలయంగా మారింది.

పూజారులు, రాజవంశీకులు, పెద్ద భూస్వాములు, వ్యాపారులు సామాజికంగా ఆర్థికంగా ఉన్నత వర్గానికి చెందినవారు. పాలకులుగా వున్నారు. సుదీర్ఘకాలం విదేశీ పాలనలో మగ్గిన జూడియాను ఏ దేశం ఆక్రమిస్తే ఆ దేశానికి తొత్తులుగా వ్యవహరించారు. విదేశీ గ్రీసు సంస్కృతికి దాసోహమయ్యారు. పేరుతోసహా వేష, భాషలు మారిపోయాయి. గ్రీకు వస్తువులపై మోజు పెరిగింది. జిమ్నాషియం క్లబ్బులు స్థాపించారు. సుంతీ పద్ధతులను కూడా కొందరు తిరస్కరించారు. మతాన్ని, రాజకీయాన్ని ముడివేసి జూడియా సమాజాన్ని శాసించారు.

సద్యూసిస్‌లు యూదుల పవిత్ర గ్రంథం టొరానే ప్రామాణికంగా తీసుకోవాలంటారు. గ్రంథంలో రాయబడిన సూత్రాలే (written laws) శిలా శాసనాలు. మౌఖికంగా చెప్పబడినవి (oral laws) కాదు. విధి (fate)ని ఒప్పుకోరు. దేవతలు, దయ్యాలు, ఆత్మలు లేవు. దేవుడు చెడు చేయడు. మంచి చేసినా, చెడు చేసినా అందుకు మనిషే బాధ్యుడు. మరణాంతర జీవితంలేదు. అక్కడ పాపాలకు శిక్షలు లేవు. చనిపోయినవారు పునరుత్థానం చెందరు.

యూదు న్యాయస్థానంలో మెజార్టీ వీరిదే. టోరాలో రాసిన సూత్రాలే చట్టబద్ధంగా భావిస్తారు. జెరూసలెం రెండవ పవిత్ర దేవాలయమే యూదులకు సర్వస్వం అంటారు.

ఫారిసీస్‌లు (Pharisees) – క్రీ.పూ. 150 మక్కాబియన్స్ తిరుగుబాటు కాలంలో యూదు సంస్కృతి, సంప్రదాయాల్ని, ఆత్మగౌరవాన్ని పరిరక్షించటానికేర్పడిన మత, రాజకీయ సంఘం. సామాజికోద్యమంగా ఎదిగింది. మధ్యతరగతి మేధావులు, వ్యాపారులు సుమారు 6000 మంది

ఈ సంఘ సభ్యులు. సాధారణ ప్రజలలో వీరికి అత్యంత ప్రజాదరణ వుంది. మతాన్ని, దేవుడ్ని గుడిలో బంధించకుండా ప్రజలలోకి తీసుకెళ్ళాలనేదే వీరి ధ్యేయం. పద్యూసిస్ పూజారుల వారసత్వ హక్కును వ్యతిరేకించారు. చదువు సంధ్యలుండి టోరా గ్రంథంపై పట్టున్నవాడే పూజారి అన్నారు. సమకాలీన పరిస్థితులకనుగుణంగా టొరాకి భాష్యం చెప్పవచ్చు. రాత గ్రంధాన్నేగాక, మోసస్ మౌఖిక సూత్రాలు కూడా ఆచరించాలి. బైబిల్ పాత నిబంధనావళిలోని అన్ని గ్రంథాలను ప్రామాణికమైనవిగా స్వీకరించాలి. జంతు బలులను నిషేధించాలి. ప్రార్ధనలు యూదు ఎసెంబ్లీలో జరపాలి. విదేశీ సంస్కృతి, నాగరికతలకు దూరంగా వుండాలి. పాలకుడు, ప్రధాన పూజారి ఒక్కరే కాగూడదు.

అన్నింటికి మూలం భగవంతుడే. దేవతలు, దయ్యాలుపై నమ్మకం వుంది. మరణానంతర జీవితం వుంది. ఆత్మ నిత్యం. మంచివాళ్ళ ఆత్మ మరో మనిషిలోకి ప్రవేశిస్తుంది. చెడ్డవాళ్ళ ఆత్మ శిక్షింపబడుతుంది. చనిపోయినవారు పునరుత్థానం పొందవచ్చు.

ఫారిసీస్‌లు యూదు న్యాయస్థానాలలో మైనార్టీవర్గం. వాదనా పటిమలో నిష్ణాతులు. మక్కాబియన్ల తిరుగుబాటుకి మద్దతు తెలిపినప్పటికి బలవంతపు మత మార్పిడులు, ఇతర పాలస్తీనా ప్రాంతాల ఆక్రమణలు కూడదన్నారు. మక్కాబియన్‌రాజు జాన్ హిర్కానిస్ కాలంలో వీరి సిద్ధాంతానికి అధికార ఆమోదం లభించింది.

ఆధునిక పాత సాంప్రదాయక యూదు మతాన్ని సంస్కరించి కొత్త యూదు మతం (Rabbanic Zudaism)గా ఆవిర్భవింపజేసింది ఫారసీస్‌లే.

ఎస్సెనెస్‌లు (Essenes) – సాంప్రదాయక యూదు మతానికి భిన్నంగా ఒక ప్రత్యేక జీవనశైలి, ఆలోచనా విధానం గల్గినవారు. సెద్యూసిస్ పూజారివర్గం నుండి చీలిన గ్రూపుగా భావిస్తున్నారు. విదేశీయులు, వారి తొత్తులు అధీనంలోని రెండవ జెరూసలెం దేవాలయం అపవిత్రమైందని, యూదుల దేవుడు అక్కడలేడని, పరిశుద్ధ జీవితం గడుపుతున్న తమ మధ్యనే వున్నాడని చెబుతారు. క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 1 వరకు వీరు ఈ జీవన విధానాన్ని అనుసరించారు.

నగరాలకు దూరంగా ఎడారులలోని మారుమూల గ్రామాలలో నదుల ఒడ్డున గుడారాలలో, కొండ గుహలలో సామూహిక జీవితం గడుపుతారు. వీరి సంఖ్య సుమారు 4 వేలని, చరిత్రకారుడు జోసిఫాస్ చెప్పాడు. ఎస్సెనెస్‌లకు సొంత ఆస్తి, ధనిక, పేద తేడాలు వుండవు. సేవకులు, బానిసలు వుండరు. సైద్ధాంతికంగా కూడా బానిసత్వాన్ని వ్యతిరేకిస్తారు. అందరూ సమానమే. ఉన్నది సమంగా పంచుకుంటారు. అసలైన రాజు దేవుడు మాత్రమే. ఇతరులను గుర్తించరు. గ్రీస్, హస్మోనియన్, రోమ్ రాజరికానికి దూరంగా వున్నారు.

వ్యవసాయం, పాడి, చేతిపనులు ప్రధాన వృత్తి. భూమి, వాతావరణం, పంటల గురించి మెండైన జ్ఞానం, లోతైన అనుభవం వున్నాయి. లాభాపేక్ష లేకుండా తమలో తాము వ్యాపారం చేసుకుంటారు. స్వయంగా సంపాదించిన ధనాన్ని ఎన్నుకున్న సంఘ ప్రతినిధికి అప్పగిస్తారు. అవసరమైన వాటిని కొనుగోలు చేస్తారు. విలాస వస్తువులు జోలికి పోరు. తమదైన సొంత ఆర్థిక వ్యవస్థను నిర్మించుకున్నారు. ప్రాచీన రాత ప్రతులను అధ్యయనం చేస్తారు. విద్య, వైద్యం, ఖగోళశాస్త్రంలను ప్రత్యేక శ్రద్ధతో నేర్చుకుంటారు. ఈజిప్టు, గ్రీస్, ఇతరదేశాల సైన్సు, తాత్విక గ్రంథాలను కూడా పఠిస్తారు.

దైనందిన జీవితం అతిసామాన్యం. సూర్యోదయానికి ముందేలేచి, స్నానంచేసి, తెల్లని డ్రెస్సుతో ప్రార్ధనలు చేయడం నిత్యకృత్యం. సామూహిక భోజనాలు (సబ్బాత్) చేస్తారు. మాంసం ముట్టరు. సారా తాగరు. శుక్రవారం పవిత్రదినం. బాప్తిస్మము పొందుతారు. దేవుడి కుమారుడి రాకకై ఎదురు చూస్తుంటారు. ఈ సంఘంలో జేరాలంటే ఒక ఏడాది ప్రొబేషన్ పీరియడ్, మూడేళ్ళు ట్రైనింగు వుండాలి. పెళ్ళిళ్ళు పిల్లల కోసమే. పుట్టిన పిల్లలు అందరికి చెందినవారే.

సమష్టిగా శ్రమించి, సమంగా పంచుకొనే ఎస్సెనెస్‌లు సామూహిక జీవన విధానాన్ని ప్రాచీన కమ్యూనిజంగా కూడా చెబుతారు.

జెరూసలెం దేవాలయాన్ని బహిష్కరించి, అవినీతి సమాజానికి దూరంగా ఎస్సెనెస్‌లు డెడ్‌సీ దగ్గర ఖుమ్రాన్ కొండ గుహలలో వుండేవారని జోసెఫస్ రాశాడు. నూతన నిబంధనవాళిలో వీరి ప్రస్తావన లేదు.

* కాటస్కీ చెప్పిందే నిజమైంది. 1947–1954 మధ్య ఇజ్రేల్‌లోని డెడ్‌సీ దగ్గర ఖుమ్రాన్ కొండగుహలలో పాపిరస్ ఆకులపై రాయబడిన 900 పత్రాలు దొరికాయి (Dead sea scrolls). ఒక అరబ్ గొర్రెల కాపరి కుర్రాడు ఒక నాణేన్ని గుహలోకి విసిరాడు. ఆశ్చర్యంగా కుండపగిలిన శబ్దం వినపడింది. వెళ్ళి చూడగా ఈ పత్రాలు బయటపడ్డాయి.

మొదట వాటికన్ పెద్దలు ఈ పత్రాలపై నోరు మెదపలేదు. తరువాత 20 శాతం పత్రాల్ని విడుదల చేశారు. మిగిలిన వాటిని దశాబ్దాలపాటు ప్రపంచానికి తెలియకుండా తాళం వేశారు. కొన్ని ఫొటోలు బయటకు రావటంతో, క్రిస్టియన్, యూదు మేధావుల ఆందోళనకి తలవొగ్గి 1990–91లో విడుదల చేశారు. అందులో చెప్పుకోదగ్గది ఏమీ లేదని చేతులు దులిపేసుకున్నారు.

నిజమే, క్రీస్తు గురించి, ఆయన అనుచరులు గురించి ఆ పత్రాలలో ఏమీలేదు. ఆనాటి ప్రపంచం గురించి విలువైన సమాచారం మాత్రం వుంది. అవి క్రీ.పూ. 250 – క్రీ.శ. 68 నాటివి. హిబ్రూ బైబిల్ పాత నిబంధనావళి పుస్తకాలు అనేకం వున్నాయి. అదే సమయంలో ఖుమ్రాన్ కొండగుహలలో నివసించిన ఎస్సెనెస్‌లు, ఇతర తీవ్ర రాజకీయ వర్గాల గురించిన వివరాలు వున్నాయి. రోమన్ సామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో యూదుమతం అనేక సంస్కరణలకు లోనైందని ఋజువైంది.



## మానవతావాది, నాస్తికులు సమీర కు జోహార్లు!

మానవహక్కుల కార్యకర్తగా పనిచేసిన షేక్ సమీర ది.05–05–2024 న కడపజిల్లా అక్కాయపల్లెలోని తన స్వగృహంలో మరణించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్స్ సముదాయం నుండి నాస్తికత్వాన్ని ప్రచారం చేసినవారు సమీర. చార్వాకాశ్రమంలో జరిగిన అనేక కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. సమీర మరణానికి నాస్తికసమాజం సంతాపం తెలియజేస్తుంది.

# శ్రీ వేంకటేశ సుప్రభాత శృంగారం - వెనిగళ్ళ సుబ్బారావు

*(ఈ వ్యాసం 1982లో ప్రచురించిన శ్రీ వేంకటేశ సుప్రభాత శృంగారం పుస్తకంలోనిది)*

*(గత సంచిక తరువాయి)*

ఇంతవరకూ వివరించిన ఈ సుప్రభాత శ్లోకాలవల్ల, వాటికి అనుబంధంగా ఉదాహరించిన ఇతర భక్తి గీతాలవల్ల పూజంటే బూతనీ, బూతుపూజ తప్ప మరొకటి లేదనీ స్పష్టమవుతుంది. ఇదే విషయాన్ని తాపీ ధర్మరావుగారు "దేవాలయాల మీద బూతుబొమ్మ లెందుకు?" అన్న వారి గ్రంథంలో ఇంకా స్పష్టంగా వివరించారు. అది ఈ క్రింద వుదహరిస్తున్నా – విలోకించండి, పూజ, భక్తి, ఆరాధన, అర్చన అంటే ఏమిటో బోధపడుతుంది :

"సంభోగము పవిత్రమైన దైవభక్తికి సూచన. దేవతారాధనకు సంభోగమే ముఖ్య సాధన."

"దేవాలయాలన్నీ ఆ రోజుల్లో సంభోగాల కోసమూ, బూతుపనుల కోసమూ నిర్మించినవే. బూతు అంటే ఇప్పుడు మనం చాలా అసహ్యంగా చూస్తూ ఉన్నాం. కాని, ఆ రోజుల్లో అది ఒక మహాకార్యం. ఒక ప్రజాసేవ. ఒక మహాభక్తి. ఒక పవిత్ర ఆరాధన, ఘనకార్యం. ఆ రోజులలో దాని యందు అసహ్యత లేదు. నీచత లేదు. పాపం లేదు. మీదు మిక్కిలి అందరూ చేయవలసినది. పవిత్రమైనది. గౌరవానికి అర్హమైనది. అది చేయకపోతే దేశ ద్రోహం. కృతఘ్నత. అలా చేయని వారిని నరకానికి పంపించేవారు." (పేజి–13) (తాపీధర్మారావు గారి ఈ అన్వేషణ అమోఘమైనదని ఈ గీతాలవల్ల ఋజువవుతుంది; ఈ సుప్రభాతాల వల్ల స్పష్టమవుతుంది.)

"ఆ బూతుపనులు ఎక్కడో చేయటం కాదు. సాక్షాత్తూ దేవాలయంలోనే, దేవుడి సన్నిధానంలోనే చేయాలి. అందరికి తెలిసేట్లే చేయాలి. సిగ్గు – దాపరికం ఉండనక్కర్లేదు. ఇదంతా నిజం." (పేజి –14)

వారి వివరణను ఈ భక్తి గీతాలు రూఢిపరుస్తున్నాయి. ఆ రోజుల్లో బూతును నీతిగా భావించడం జరగకపోతే సామ్రాజ్య సింహాసనంపై సీతతో రాముడు రతిజరపగలడా? ఆ విషయాన్ని భక్తుడు వ్రాయగలడా? మరొక భక్తుడు తన తాపాన్ని కూడా తీర్చమని దేవుణ్ణి ప్రార్థించగలడా? దైవత్వమంటే సంభోగమేనని శ్రీరాముడు జ్ఞానముద్రతో బోధించగలడా? వేంకటేశ్వరుడు లక్ష్మీదేవిని వక్షస్థలంపై ఉంచుకుని తన కళ్యాణ గుణాన్ని నిరూపించగలడా? ఆలోచించండి.

"దేవాలయాలన్నీ ఆ రోజుల్లో సంభోగాలు కోసమూ, బూతుపనుల కోసము నిర్మించినవే" అయినప్పుడు "సంభోగం పవిత్రమయిన దైవభక్తికి సూచన. దేవతారాధనకు సంభోగమే ముఖ్యసాధన" అయినప్పుడు ఆ దేవాలయాల్లో చదివే మంత్రాల్లోనూ, దండకాల్లోనూ, స్తోత్రాల్లోనూ, సుప్రభాతాల్లోనూ సంభోగ వర్ణనలు, బూతులు లేకుండా ఉండగలగటం సాధ్యమేనా? అన్న నా సందేహానికి ఈ సుప్రభాత శ్లోకాలు, ఈ భక్తి గీతాలు సాధ్యంకాదన్న పరమ సత్యాన్ని ఋజువు చేస్తున్నాయి.

అటువంటి బూతు కేంద్రాలైన అనేక దేవాలయాల్లో ప్రధానమైంది. తిరుపతి అనడానికి గల నిదర్శనం. ఆ తిరుపతి కొండకు 'వేంకటాచలం' అనే పేరు రావటానికిగల కథను పరిశీలించిన బోధపడుతుంది.

**వ్యభిచార చిహ్నమే గుండుగొరుగుడు**

ఆ రోజుల్లో బూతుపనులు సాక్షాత్తూ దేవాలయంలోనే, దేవుడి సన్నిధానంలోనే, అందరి ఎదుటనే, చేయాలనీ, సిగ్గూ, దాపరికము ఉండకూడదనే విషయం కూడ పై గ్రంథమే తెలియజేస్తుంది. (పేజి-14)

ఆ రకంగా దైవభక్తికి చిహ్నమైన, పుణ్యకార్యానికి ప్రధానమైన వ్యభిచారాన్ని దేవాలయంలో చేయడానికి అంగీకరించనివారిని పాపాత్ములని చిత్రించేవాళ్లు. దేశద్రోహులని చూపించే వాళ్లు. వారిని చిత్రహింసల పాల్జేసేవాళ్లనీ, ఆ తరువాత కొంతకాలానికి వ్యభిచరించడానికి అంగీకరించని వారి తలను గొరిగి అవమానపరచే వారనీ, దేవుడికి వెంట్రుకలిస్తే, దేవాలయంలో దేవుడి సమక్షంలో వ్యభిచరించిన దానితో సమానమనీ, అందుకే ఈ నాటికీ శ్రీవేంకటేశ్వరమూర్తికి తల వెంట్రుకలు సమర్పించుకునే ఆచారం నిలిచి ఉందనీ, ఆనాడు మనం చేయవలసిన వ్యభిచారానికి బదులుగా, ఈనాడు వెంట్రుకలను బలి ఇస్తున్నామన్నమాట మనం మరిచిపోయామని తాపీధర్మారావుగారు గుర్తు చేస్తున్నారు. (దేవాలయాలమీద బూతుబొమ్మ లెందుకు? పేజి-86)

ఈనాడు తిరుపతికి పోతున్న భక్తులంతా గుండు గొరిగించుకుంటున్నారు. తమ పాపాలన్నీ పోయాయని ఆనందిస్తున్నారు. ఈ గుండు గొరిగించుకునే విషయంలో ఆడ మగ అనే తేడా కాని, చిన్న పెద్ద అనే భేదం కాని పాటించటం లేదు. గుండు గొరిగించుకునే వారంతా వ్యభిచరించిన వారేననీ, వ్యభిచరించినందుకు నిదర్శనమే గుండు గొరుగుడని ఇంతవరకూ ఇచ్చిన వివరణ వల్ల తెలుస్తుంది. (ఇంకా వుంది)

---

## సైన్సే మార్గం! – మా.శ్రీ.రాజు

కులం కులం అంటావు!
కుళ్ళునే నింపుతావు!!
కళ్ళు తెరవకుంటావు!
గుణం సంగతి చూడవా?
మతం మతం అంటావు!
మత్తులో మునుగుతావు!!
మంటలే రేపుతావు!
మానవత్వం సంగతి పట్టించుకోవా?
భాష భాష అంటావు!
బంధాలే తెంపుతావు!!
బడబాగ్ని ఎగచిమ్ముతావు!
బ్రతుకు దెరువు చూసుకోవా?
ప్రాంతం ప్రాంతం అంటావు!
పైశాచికంలో మునుగుతావు!!
ప్రాణాలే తీస్తావు!
ప్రేమానురాగాలే పొందవా?
లేని దేవుడు దగ్గర –
లెంపలు వేసుకుంటావు!
ఉన్న మనుషుల దగ్గర –
ఉన్మాదం చూపిస్తావు!
ఏం మనిషివయ్యా నువ్వు?
ఏం మనసయ్యా నీది??
ఇగనైనా మారాలి నువ్వు!
ఇగనైనా మార్చుకోవాలి నీ మనస్సు!!
కులం కాదు –
గుణం కావాలి!
మతం కాదు –
మానవత్వం వుండాలి!
భాషాద్వేషం కాదు –
బంధువులం అవ్వాలి!
ప్రాంతీయ తత్వం కాదు –
ప్రేమానురాగాలు పొందాలి!
అందుకు –
హేతువాదమే గమనం!
నాస్తికత్వమే గమ్యం!
సైన్సే సరియైన మార్గం!!

# మెటాఫిజిక్స్

– డా॥ ఆర్.కె.

పారభౌతికవాదం – అది భౌతికవాదం – జడభౌతికవాదం అని కూడా అంటారు. సరైన తెలుగు పదం స్థిరం కాలేదు. 'మెటా' గ్రీక్ పదం. 'తరువాత' అని అర్థం. క్రీ.పూ. 1వ శతాబ్దంలో అరిస్టాటిల్ గ్రంథాలను ఎడిట్ చేసినవారు ఆంద్రోనికస్ రోడిస్ సారథ్యంలో వాటిని రెండుగా విభజించారు. ఫిజిక్స్ పదార్థం, దాని చలనం, మార్పు గురించి చెబుతుంది. భౌతిక వస్తువుల గుణగణాలను వివరిస్తుంది. ఆ తరువాతవి, అవి కానివి మెటాఫిజిక్స్ అన్నారు. ప్రపంచంలోని ఇంద్రియ గోచరమైన వస్తువుల్ని ఫిజిక్స్ పరిశీలిస్తుంది. అగోచరమైన ప్రపంచం లోతుల్ని మెటాఫిజిక్స్ అధ్యయనం చేస్తుంది.

ఒకప్పుడు మెటాఫిజిక్స్‌కి చెందినవి తర్వాత కాలంలో ఫిజిక్స్‌కి మారటాన్ని కూడా మనం చూడగలం. ప్రాచీనగ్రీక్ తత్వశాస్త్రంలోని డిమొక్రటిస్ అణువులుకు హేతుబద్ధత వుంది కాని రుజువు లేదు. అవి శాశ్వతం, విభజింపరానివి అనుకున్నారు. ఆధునిక కాలంలో అది తప్పని నిరూపింపబడింది. విద్యుత్ అయస్కాంత క్షేత్రాలు, పార్టికల్స్, అయాన్స్ కూడా ఫిజిక్స్‌లో భాగమయ్యాయి. శుద్ధ శక్తివాదాన్ని ముందుకుతెచ్చారు. పదార్థము, శక్తి ఒక్కటేనని, అవి సృష్టింపబడవు, నాశనం గావింపబడవు అని ఆధునిక విజ్ఞానశాస్త్రం చెప్పింది. ఎక్కడ ఫిజిక్స్ ఆగిపోయిందో అక్కడ మాత్రమే మెటాఫిజిక్స్ గూడుకట్టుకుంది. భౌతిక సత్యం ఎన్నటికి దాగదు. అందువల్లే సైన్సు నిరంతరం అభివృద్ధి చెందుతోంది. మెటాఫిజిక్స్ రాను రాను కుచించుకు పోయింది.

కాలానుగుణంగా మెటాఫిజిక్స్ నిర్వచనం మారింది. మెటాఫిజిక్స్‌లో రెండు వాదనలు చోటు చేసుకున్నాయి.

ఒకటి : మనస్సుకు వెలుపల స్వతంత్రంగా మనగలిగేవి, వాస్తవిక (రియాలిటీ) మైనవి.

ఉదా :– స్థలము, కాలము, సాపేక్షము, అనంతం మొదలలైనవి. ఇవి భౌతిక వస్తువులు కాదు. కాని వస్తువులతో సంబంధం గలవి.

రెండు : మనస్సుకు వెలుపల స్వతంత్రంగా మనలేనివి. వస్తువుతో సంబంధం లేనివి. భావపరమైనవి. (ఐడియలిస్టిక్). భౌతిక ప్రపంచాని కతీతమైనవి.

ఉదా :– దేవుడు, ఆత్మ, పునర్జన్మ అఖండభావం, బ్రహ్మం మొదలైనవి. అయితే మతంతో మెటాఫిజిక్స్‌కి సంబంధం లేదు.

ఈ రెండు పరస్పర విరుద్ధ భావాలూ మెటాఫిజిక్స్‌లో కొనసాగాయి.

సృష్టికర్త ఎవరు? అతడిని సృష్టించింది ఎవరు? ఆది ఏది? అంతం ఏది? పదార్థము – చైతన్యము, వస్తువు–గుణము ఏది ప్రధానం? దేనినుండి ఏది జనించింది? అది భౌతిక కారణం కావచ్చు భౌతికాతీతమైనది కావచ్చు ఇలాంటి తొలి ప్రశ్నలు మెటాఫిజిక్స్‌కి చెందినవే.

మెటాఫిజికల్ దృష్టిలో ప్రతిదానికి ఒక అంతిమ కారణం వుంటుంది. అది మారనిది.. స్థిరమైనది. మరొక దానితో ఎలాంటి సంబంధము లేనిది. ఇటు భావవాదులు, అటు భౌతికవాదులు మెటాఫిజికల్ పద్ధతిని తమ వాదనలకు వాడుకున్నారు.

ఫిజిక్స్ ఇంద్రియానుభూతిపై ఆధారపడి, ప్రయోగపూర్వకంగా,. హేతుబద్ధమైన ఆలోచనతో రుజువును కోరుతుంది. ఇక్కడ వస్తువు ప్రధానం. మెటాఫిజిక్స్ అలాకాదు. భావ ప్రధానంగా మారింది. భౌతిక తత్వానికి ఆవల గట్టున వుంటుంది. కేవలం తర్కజ్ఞానంపై ఆధారపడుతుంది.

## మెటాఫిజిక్స్ ఇలా చెబుతుంది

* ప్రకృతిలో ప్రతిదీ దేనికదే విడివిడిగా పరస్పర సంబంధం లేనిదిగా వుంటుంది.

* ప్రతిదీ నిశ్చలమైనదిగా, స్థిరమైనదిగా, మార్పు లేనిదిగా వుంటుంది.

* ఒకవేళ మారినా వున్నదివున్నట్టుగానే మారుతుంది గాని అభివృద్ధికర, గుణాత్మక మార్పుగా వుండదు. మార్పు వుంటే అది సంఖ్య, పెరుగుదల, తరుగుదలలో, స్థాన చలనంలో మాత్రమే. ఆ మార్పుకికూడా కారణం బాహ్య శక్తులేగాని అంతరంగికమైనవి కావు. ఏది జరిగినా అది యాదృచ్ఛిక ఘటన గానే చూడాలి.

* ఒక వస్తువు అదే రకమైన వస్తువుగా పునరావృతం అవుతుందిగాని భిన్నమైన వస్తువుగా మారజాలదు.

ఇదే ప్రకృతి నియమాన్ని మెటాఫిజిక్స్ సమాజానికన్వయించింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల మధ్య పరస్పర సంబంధాల్ని చూడ నిరాకరించింది. సమాజాన్ని వ్యక్తులుగా, సామాజిక సమస్యల్ని వ్యక్తిగత సమస్యలుగా చూచింది. వ్యక్తిగత పరిష్కారాన్ని సూచించింది. వర్గాలు, వర్గప్రయోజనాలు, వర్గ వైరుధ్యాలపై ముసుగు కప్పింది. ఈ సమాజం ఇప్పుడూ, ఎప్పుడూ ఇలాగే ఉంటుందని, దోపిడీ, ఆర్థిక అసమానతలు సహజమని, సమాజంలో ఆకస్మికంగా, అనూహ్యమైన మార్పులు అనివార్యమని అనుకోవడం భ్రమేనని తేల్చి చెప్పింది. చివరికి మెటాఫిజిక్స్ పద్ధతి అభివృద్ధి నిరోధక ధోరణికి ప్రతినిధిగా నిలిచింది.

---

## నీట్, యు.జి.సి. నెట్ పరీక్షలలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి!

వైద్య విద్య ప్రవేశ పరీక్ష (నీట్) ప్రశ్నాపత్రం పరీక్షకు ఒక రోజు ముందే లీక్ అయింది. నీట్ ఫలితాలు ప్రకటించిన తేది (జూన్ 14) కంటే పదిరోజుల ముందు జూన్ 4వ తేదీన విడుదల చేశారు. ఆ ఫలితాలలో 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులు వచ్చాయి. వారిలో ఆరుగురు విద్యార్థులు ఒకే సెంటర్‌వారు. నెగెటివ్ మార్కులు కారణంగా సాధ్యంకాని 717, 718, 719 మార్కులు అనేక మంది విద్యార్థులకు వచ్చాయి. ఈ సంఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైనాయి.

వ్యాపమ్ స్కాం తదితర ప్రవేశ పరీక్ష పత్రాల లీకేజీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రదీప్‌కుమార్ జోషి, ఎన్‌టిఏ ఛైర్మన్‌గా ఉన్నారు. గత ఐదేళ్ళలో 15 రాష్ట్రాల్లో 41 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయినాయి. యు.జి.సి- నెట్ పరీక్ష నిర్వహణలో పేపర్ లీక్ అయిందని భావిస్తూ పరీక్ష జరిగిన తర్వాత రోజు నెట్ పరీక్షను NTA రద్దు చేసింది. ఈ ఘటనలపై NTA గానీ, కేంద్ర విద్యాశాఖ వారు కానీ స్పందించక పోగా – నిరసనకారులను అణచివేస్తూ అరెస్టులు చేస్తున్నారు.

విద్య కేంద్రీకరణను, కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తున్న నీట్ తరహా పరీక్షలను రద్దు చేయాలి! ప్రవేశ పరీక్షలన్నిటినీ రాష్ట్రాలవారీగా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించాలి. నీట్, నెట్ విద్యార్థులకు జరిగిన అన్యాయం పట్ల ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి!



# నిత్య చైతన్య భావోద్యమ తరంగం దేవగుప్తపు పేరలింగంకు జోహార్లు!

ఆయనో సాధారణ కార్మికుడు. కానీ, అసాధారణ భావోద్యమకారుడు. గోదావరి జిల్లాలో దశాబ్దాలుగా ఒక్కడిగానే హేతువాద ప్రచారం చేస్తున్న బుద్ధిజీవి. పడక్కుర్చీ మేధావుల్లా కాకుండా జ్ఞానం సమాజహితమని నమ్మే ప్రజాపక్ష ఆలోచనాశీలి. మతోన్మాదం పడగ మీదనే ధైర్యంగా నిలిచి మనిషి పక్షాన గొంతెత్తే మానవతావాది. అనారోగ్యం కారణంగా ఇంటిపట్టున ఉండాల్సి వస్తే ఆ సమయాన్ని అధ్యయనానికి వినియోగించుకొని ఆరేడు సంవత్సరాల్లో పదికి పైబడి పుస్తకాల్ని రచించి ప్రచురించిన అరుదైన ఉద్యమకారుడు. ఆయనే నిరంతర ప్రజా చైతన్య తరంగం, మన దేవగుప్తపు పేరలింగం!

మూడు దశాబ్దాలకు పైగా సైన్సు ప్రచారాన్ని నిర్వహిస్తూ, తన సైకిల్‌కి 'హేతువాద చైతన్య రథం' అనే పేరు పెట్టి మారుమూల గ్రామాలకు కూడా భావోద్యమాల కోసం వెళ్ళడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. వివిధ మతాలకు చెందిన ముష్కరులు అనేకసార్లు అడ్డగించడం, అనేక విధాల అవాంతరాలు సృష్టించడం చేసినా ఎన్నడూ వెనకడుగేయని వైజ్ఞానికోద్యమ ప్రచారకుడు, రాజ్యాంగబద్ధమైన శాస్త్రీయ స్పృహనూ, మానవవాదాన్నీ పౌరసమాజంలో పెంపొందించడమే తన జీవిత లక్ష్యంగా జీవితాంతం పని చేసిన అభ్యుదయవాది, ఆచరణశీలి ఆయన!

సైన్సు మూలాల్ని వెలికితీసి మూఢనమ్మకాల్ని నిరసించినా, ఆదిమానవుడు మొలకు ఆకులు కట్టుకున్నది సిగ్గువల్ల కాదని శోధించి చెప్పినా, ఓ మహిళా నీకు మతమెందుకమ్మా? అని బోధించినా, ప్రాచీన కుల సంస్కృతిపై కలమెత్తినా, పెళ్ళి మంత్రాల్లో దాగి ఉన్న బూతుల మర్మాన్ని బయటపెట్టడం మొదలు వేంకటేశ్వర సుప్రభాత శృంగారాన్ని విశ్లేషించినా, బైబిలు నుండి ఖురాన్ వరకూ అన్ని మత గ్రంథాల ఆదుపాదుల్ని ఎనభై ఏళ్ళ వయసులో కూడా పరిశోధన ద్వారా వెలికితీసి పదికి పైబడి పుస్తకాలు రాసి, వాస్తవాలు బయట పెట్టినా అదాయన జిజ్ఞాసకి ప్రతీక!

అంతేకాదు, దేవగుప్తపు + పాకలపాటి వార్ల చరిత్ర కూడా శోధించిన చరిత్రకారుడు. పట్టువదలని హేతువాద విక్రమార్కుడు పేరలింగం స్వగతం పేర జీవిత చరిత్రను కూడా ధైర్యంగా రచించగలిగిన ధీశాలి. అంతేకాదు, తాను రాసిన ప్రతి పుస్తకంలోనూ ఆ రచనకి ఉపకరించిన ఆధార గ్రంథాల జాబితా మొదలుకొని రచనకి ఆర్థికంగా సహకరించిన వ్యక్తుల జాబితా వరకూ మొత్తం పారదర్శకంగా ప్రచురించడమే కాకుండా ఏకంగా, "మతాల మూలాల్నీ, కులాల కుత్సితాలనూ, కల్పిత దేవుళ్ళ పుట్టు పూర్వోత్తరాలను బయటపెట్టి ఎండగట్టడమే తన జీవిత లక్ష్యమ"ని బహిరంగంగా ప్రకటించే ధైర్యశాలి!

ఇవన్నీ ఒకెత్తయితే వెనిగళ్ళ సుబ్బారావు, తాపీ ధర్మారావు, ఆరుద్ర, అంబేద్కర్, సి. వి., ఏటుకూరి బలరామమూర్తి, నార్ల వెంకటేశ్వరరావు, పింగళి దశరధరామ్ వంటి వారి రచనలతో

తన చిన్న ఇంట్లోనే 'సైన్సు గ్రంథాలయం' పేరిట అద్భుతమైన లైబ్రరీ ఏర్పాటు చేసుకుని కొనసాగించడం ఒకెత్తూ, దేవుడు ఉన్నాడని, దైవ మహిమలను నిరూపించమని బహిరంగ వేదిక మీద ఉమ్మడి చర్చకు సిద్ధపడమని సవాల్ విసరడమే కాక గోదావరి జిల్లా హేతువాద ప్రచారకుడిగా లక్ష రూపాయల ఛాలెంజ్ చేసి ఆశ్చర్యపరచడం మరొకెత్తు. ఇవన్నీ ఆయనలో అబ్బురపర్చే సుగుణాలే! దేవగుప్తపు పేరలింగంగారు 82 సం॥ వయసులో రాజమండ్రిలోని తన స్వగృహంలో 14-04-2024న మరణించారు. ఆయన మరణానంతరం, ఆయన కోరిక మేరకు ఆయన నేత్రాలను, దేహాన్ని హాస్పిటల్‌కి ఇవ్వడం జరిగింది.

---



ప్రజాకళా మండలి సభ్యుడు, నాస్తికుడు

## కామ్రేడ్ డప్పు చంద్రకు జోహార్లు!

ప్రకాశం జిల్లా జె. పంగులూరు మండలం నార్నెవారిపాలెం వా॥లు చంద్ర 4 దశాబ్దాల క్రితం గుంటూరు జిల్లా చిలకలూరిపేట ప్రాంతంలో ఫ్యాక్టరీ కార్మికుడిగా జీవనం మొదలుపెట్టి, ఆనాటి ఉద్యమ మిత్రులు కామ్రేడ్ సాంబయ్య, లక్ష్మయ్య సహచర్యంతో ఉద్యమాలలో తొలి అడుగులు వేశాడు.

విప్లవోద్యమం విస్తరణలో భాగంగా ప్రకాశం జిల్లా నల్లమల్ల ప్రాంతంలో 1988లో క్యాంపెయిన్ టీం సభ్యుడిగా 45 రోజులు పాటు అనేక గ్రామాలు, గూడేలు ప్రజలతో మమేకం కావడం జరిగింది. చంద్ర వాళ్ళ అమ్మతో నార్నెవారిపాలెంలో కొంతకాలం జీవించాడు. మార్క్సిజాన్ని ఆచరించిన చంద్ర తన జీవితమంతా దళిత ప్రజలతో కలిసి జీవించాడు. అగ్రకుల ఆధిపత్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు.

విప్లవ కార్యాచరణలో ఉంటూనే ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడుకు చెందిన కామ్రేడ్ వాణిని వివాహం చేసుకొని, అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొని చివరికి తాను పనిచేస్తున్న ఫ్యాక్టరీలో 12-5-2024న గుండె పోటుతో మరణించాడు.

తొలి రోజుల్లో పాటలు పాడటానికి చాలా కష్టపడాల్సి వచ్చింది, క్రమక్రమంగా పాటలు పాడుతూ, డప్పు కొట్టడంతో సహా అనేక కళారూపాలు పట్టుదలగా నేర్చుకుని ఉద్యమంలో భాగస్వామి అయ్యాడు, తన జీవిత భాగస్వామిని కూడా కళాకారిణిగా తీర్చిదిద్దాడు, ప్రతి నాస్తికమేళాలో పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలు యిచ్చేవాడు.

నేటి ప్రజా ఉద్యమాలపై ముప్పేట దాడులు జరుగుతున్న సందర్భంలో కామ్రేడ్ చంద్ర మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.

కామ్రేడ్ డప్పు చంద్ర మరణానికి నాస్తిక సమాజం సంతాపం తెలియచేస్తోంది.

# స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన
# భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభ

**నా**స్తిక సమాజం ఆధ్వర్యంలో ఒంగోలులోని సిపిఐ కార్యాలయంలో 31.03.2024 న దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు నాస్తిక సమాజం నాయకులు ఎస్. చలపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా "విప్లవకారునిగా నాస్తికునిగా భగత్‌సింగ్" అనే అంశంపై తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగయ్య మాట్లాడుతూ – స్వాతంత్రం కోసం పోరాడిన కుటుంబం నుంచి వచ్చిన భగత్‌సింగ్ గదర్ వీరుల స్ఫూర్తితో చిన్న వయస్సులోనే అనేక పుస్తకాలను అధ్యయనం చేసి మతాల ముసుగులో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా నాస్తికునిగా మారాడని తెలిపారు. స్వాతంత్రోద్యమ నాయకుడు లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన జనరల్ సాండర్స్‌ను కాల్చి చంపడం ద్వారా దేశ స్వాతంత్రోద్యమంలో భాగస్వామ్యమయ్యాడు అన్నారు. జైలు జీవితం గడుపుతూ సామ్యవాద సిద్ధాంతాన్ని, ప్రపంచ రాజకీయాలను అధ్యయనం చేయడం ద్వారా భారతదేశంలో విప్లవోద్యమాన్ని ఏవిధంగా నిర్మించాలి, సామ్రాజ్యవాదాన్ని ఏవిధంగా ఎదిరించాలో తెలిపాడు అని చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, జాతీయ వాదులకు కనువిప్పు కల్పించాలనే ఉద్దేశ్యంతో జాతీయ పార్లమెంట్‌లో తన సహచరులు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లతో కలిసి బాంబు దాడి చేశారని తెలిపారు. తద్వారా విప్లవోద్యమానికి ఈ దేశంలో బలమైన పునాదులు వేశారని తెలిపారు. విప్లవం వర్ధిల్లాలి అని నినదిస్తూ నమ్ముకున్న ఆశయం కోసం చిన్న వయస్సులోనే ఉరిశిక్ష పాలయ్యాడని తెలిపారు. మోడీ, ఆర్.ఎస్.ఎస్, బి.జె.పి. అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా నేడు భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించటమే మనం ఆయనకు ఇచ్చే నివాళి అని తెలిపారు. తర్కశాస్త్రం – విజ్ఞానశాస్త్రం అనే అంశంపై డా॥ కె.జయకుమార్ మాట్లాడుతూ – ఆనాడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు సమాజ పరిణామ క్రమాన్ని అర్ధంచేసుకొని అభివృద్ధి నిరోధక అంశాలను ప్రశ్నిస్తూ, సమాజ పురోగమనానికి కృషి చేశారని అన్నారు. వీరి స్ఫూర్తితో నేడు దేశంలో ప్రమాదకరంగా వున్న మనువాద ఫాసిస్టు పాలనను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాస్తిక సమాజం నాయకులు బి.సుధాకర్, సత్యనారాయణ, నరశింహారావు, ఒ.పి.డి.ఆర్. రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర రావు, ప్రజా కళామండలి రాష్ట్ర నాయకులు కోటి, కె.ఎన్.పి.ఎస్. నాయకులు దుడ్డు వెంకట్రావు, జార్జ్, భా.నా.స నాయకులు సారయ్య, రైతు కూలీ సంఘం నాయకులు లలిత కుమారి, విప్లవ రైతు సంఘం నాయకులు భీమవరపు సుబ్బారావు, జనసాహితి నాయకులు జి.వి. క్రిష్ణయ్య, విజయసారథి, పి. సుబ్బారావు ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజా కళాకారులు అభ్యుదయ గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా తత్వశాస్త్రం గతితార్కిక భౌతికవాదం మరియు చార్వాక శతకం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సభ నిర్వహణకు సహకరించిన భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, జి. ఈశ్వరయ్య, ఎమ్.ఎల్.నారాయణలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆహారం - ఆరోగ్యం

## LOW CARBOHYDRATE HIGH FAT (LCHF) DIET

## పుట్టు పూర్వోత్తరాలు

*(గత సంచిక తరువాయి)*

**డా॥ కె. శంకర్,** M.D., DTCD,

**కొవ్వులు ఆరోగ్యానికి హానికరమా?**

ఆరోగ్యకరమైన కొవ్వులు (Healthy fats) ఎంత మాత్రం హానికరం కాదు. అవి శరీరానికి అత్యంత అవసరం.

కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగితే హానికరమని వైద్యులు చెపుతూ వచ్చారు. నిజానికి, శరీరం సక్రమంగా పనిచేయడానికి కొలెస్ట్రాల్ అత్యంత అవసరమైన పదార్థం. దీని స్థాయిలు తగ్గితే అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. మనకు అవసరమైన కొలెస్ట్రాల్‌లో 80 శాతాన్ని శరీరమే తయారు చేసుకుంటుంది! ఆహారం నుండి వచ్చేది 20 శాతం మాత్రమే! అయినప్పటికి, కొవ్వులు అంటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని మనల్ని భయపెట్టడం దారుణమైన అంశం. నెయ్యిని తినకుండా చేశారు. కోడిగుడ్డును పూర్తిగా (పచ్చసొనతో) తినకుండా చేశారు. కొలెస్ట్రాల్ లేని రిఫైన్డ్ నూనెల్ని మార్కెట్‌లో ముంచెత్తుతున్నారు.

నిజానికి, ఆరోగ్యమైన కొవ్వులు శరీరంలో నిల్వ ఉండవు. పేరుకొను (Not stored). అవి నిరంతరంగా ఖర్చు కాబడుతూ ఉంటాయి. ఇందుకు భిన్నంగా మనం నిరంతరంగా తీసుకొనే పిండి పదార్థాలు కొవ్వులుగా మారి శరీరంలో పేరుకుపోతాయి (Stored). అన్ని సమస్యలు పిండి పదార్థాల వల్లనే! ఇటువంటి ముఖ్యమైన శాస్త్రీయ అంశంపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మెజారిటీ వైద్యులకు అవగాహన లేకపోవడం విచారకరం!

**అధిక ప్రోటీన్ల డైట్ మరియు పండ్లు తీసుకోవడం మంచిది కాదా?**

ప్రోటీన్లను ఎక్కువ మోతాదులో తీసుకుంటే అవి శరీరంలో 'గ్లూకోనియోజెనిసిస్' (Gluconeogenesis) అనబడు జీవ రసాయనిక ప్రక్రియ ద్వారా గ్లూకోజ్‌గా మార్పు చెందబడుతాయి. అందువల్ల ఒక కేజి శరీర బరువుకి 1-1.5 గ్రాముల ప్రోటీన్లు మాత్రమే తీసుకోవాలి. జన్యుమార్పిడి సాంకేతికత (Hybridisation) ద్వారా నేడు లభ్యమౌతున్న 'పండ్లు' (Fruits) గతం కంటే దాదాపు 6 రెట్లు అధికంగా గ్లూకోజ్ మరియు ఫ్రక్టోజ్‌లను కలిగి ఉన్నాయి. అందువల్ల మనము కొన్ని రకాల పండ్లనే పరిమితంగా తీసుకోవాలి. అలాగే, రోజూ అరగంట నుండి 45 నిముషాల పాటు ఏదో ఒక రూపంలో వ్యాయామం చేయడం ఆరోగ్యానికి మంచిది. అయితే ఒక వ్యక్తి బరువు తగ్గడానికి మాత్రం వ్యాయామ పాత్ర చాలా తక్కువ.

**మందులతో షుగర్, హైబిపి, అధిక కొలెస్ట్రాల్‌లను నియంత్రించలేమా?**

ఇప్పుడున్న మందులన్నీ షుగర్ లెవల్స్‌ను, హైబిపిని, అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గించేవే కానీ, వీటన్నింటికి మూలకారణమైన అధిక ఇన్సులిన్ స్థాయిలను, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించలేవు.

ఫలితంగా, గుండెపోటును, బ్రెయిన్ స్ట్రోక్‌ను, కిడ్నీ డ్యామేజిని, ఫ్యాటీ లివర్‌ను మరియు ఇతర కాంప్లికేషన్స్‌ను దీర్ఘ కాలంలో ఎటువంటి మందులు ఆపలేవు.

**LCHF DIET – చరిత్ర**

66 సం॥ల విలియం బాంటింగ్ (William Banting) 200 పౌండ్ల బరువుతో ఇబ్బంది పడేవాడు. ఆయన బ్రిటన్‌లో రాజవంశీకుల దగ్గర పని చేసేవారు. వారి వంశంలో ఊబకాయ చరిత్రే లేదు. ఆయన సోమరి కాదు, బద్ధకస్తుడూ కాదు, తిండిపోతూ కూడా కాదు. బరువు తగ్గడానికి వ్యాయామాలు చేస్తే కండలు పెరిగాయి, ఆకలి పెరిగింది. ఫలితంగా మరింత బరువెక్కాడు. తినడం తగ్గించినా బరువు తగ్గలేదు సరికదా ఆకలి దహించుకుపోయేది. నడిచాడు, గుర్రపు స్వారీ చేశాడు, శారీరక శ్రమ చేశాడు. అయినా పెరిగాడు. చివరిగా విలియమ్ హార్వే (William Harvey) అనబడే సర్జన్‌ను కలిశాడు. హార్వేగారు అప్పుడే పారిస్ వెళ్ళి మధుమేహం పై ఫిజియాలజిస్ట్, క్లాడ్ బెర్నాడ్ ప్రసంగం విని వచ్చాడు. ఆయన ప్రసంగాన్ని అర్థం చేసుకొని, జంతు ఆహారాలు, కూరగాయలు కలిగి ఉండి, బ్రెడ్, పంచదార, మైదాపిండి లేని ఆహారాలు తినమని సలహా ఇచ్చాడు. బాంటింగ్ హార్వే సూచన మేరకు మాంసం, చేపలు, పళ్ళు రోజూ 3 సార్లు తినేవాడు. 15 నెలల్లో 50 పౌండ్లు తగ్గాడు. ఈ కాలంలో పంచదార, బ్రెడ్, స్వీట్లు, పోటాటోలు పూర్తిగా ప్రక్కన పెట్టాడు. రెట్టించిన ఉత్సాహంతో, బ్యాంటింగ్ “లావుగా ఉండడంపై లేఖ – ప్రజలకోసం” (Letter on Corpulence, Addressed to the Public) శీర్షికతో ఒక 16 పేజీల కరపత్రాన్ని 1863వ సం॥లో తన స్వీయ అనుభవాలతో విడుదలచేశాడు. ఆయన కరపత్రం అత్యంత పాపులర్ అయ్యింది. ఆ కరపత్రం ఇతర బాషల్లో. ఇతర దేశాల్లో ప్రాచుర్యాన్ని పొందింది. ఆయన చెప్పిన విషయాలు ‘బాంటింగిజం’ పేరుతో ప్రచారం పొందాయి. 1864లో ‘బ్రిటీష్ మెడికల్ జర్నల్’ బాంటింగ్ డైట్ విశిష్ఠతను వ్యాసంగా ప్రచురించింది. అయితే ఆనాటి వైద్యశ్రేణులు మాత్రం బాంటింగ్ డైట్ పట్ల ఎటువంటి ఆసక్తిని కనపరచలేదు.

మూర్ఛవ్యాధికి ఏ మందులు లేని కాలంలో వైల్డర్ మరియు పీటర్ మ్యాన్ అనబడు వ్యక్తులు 1920 సం॥లో “కీటోజెనిక్” డైట్‌తో మూర్ఛవ్యాధిని నియంత్రణలోనికి తీసుకొచ్చారు. ఫెనిటాయిన్ (Phenytoin) అనబడే మూర్ఛ మందు మార్కెట్‌లోనికి ప్రవేశించిన తరువాత మూర్ఛ వ్యాధి నియంత్రణలో “కీటోజనిక్” డైట్ ప్రాముఖ్యత మరుగున పడింది. మూర్ఛ వ్యాధి మందుల మార్కెట్ మాయాజాలం మొదలైంది! బహుళ మందులకు లొంగని మూర్ఛ వ్యాధికి ఇప్పుడు కూడా వైద్యులు ‘కీటోజెనిక్ డైట్‌ను సిఫారసు చేస్తున్నారు.

బాంటింగ్ డైట్‌పట్ల ప్రజల్లో శ్రద్ధ పెరిగింది. ఫలితంగా ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిన ఈ రకపు డైట్ పుస్తకాలకు ఆదరణ పెరిగింది. అందులో ముఖ్యమైనది డా॥ అట్కిన్స్ డైట్ రెవల్యూషన్ – 1972 (Dr. Atkins diet revolution), ది సౌత్ బీచ్ డైట్ – 2003 (The South Beech Diet). ఈ పుస్తకాల్నీ “కార్బ్‌లు సమస్యకు మూలం తప్ప కొవ్వులు కాదని, కార్బ్‌లు తగ్గిస్తే బరువు తగ్గి ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పాయి. అయితే, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (AHA). అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (AMA), యునైటెడ్

స్టేట్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (USDA) మరియు న్యూట్రిషన్ శాఖ సంస్థల/ కమిటీలవాళ్ళు ఈ పుస్తకాలను, ఇతర శాస్త్రీయ ప్రతిపాదనలను పనికిమాలినివిగా కొట్టిపడేశారు!

20వ శతాబ్దంలోనే ఎంతోమంది శాస్త్రవేత్తలు ఆహారంపై పరిశోధనలు జరిపారు. తమపై తాము పరిశోధనలు చేసుకున్నారు. తప్పులు సరిచేసుకున్నారు. కొవ్వులు హానికరం కాదని, అధిక కార్బోహైడ్రేట్‌లే హానికరమని తేల్చారు. 21వ శతాబ్ధంలో ప్రజారోగ్యం పరిరక్షణలో శాస్త్రీయత లోపించింది. కార్పోరేట్ శక్తులైన ఆహార, మందుల పరిశ్రమల ప్రభావాలు ప్రజారోగ్యాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. ఆరోగ్యం - ఆహారం అన్న అంశానికి సంబంధించి పత్రికలు, టీవీ, వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర ప్రచార సాధనాలు, మాధ్యమాలు నిత్యం హోరెత్తిస్తున్నాయి. వీటిల్లో అధిక భాగం "ప్రజల్ని గందరగోళపరిచేవే". వైద్యులు వివిధ కారణాలవల్ల చైతన్యవంతం కావడం లేదు.

**ఆహారంపై అశాస్త్రీయతకు కళ్ళెం వేసిన పరిశోధకులు**

అనాదిగా, ఆహార సంస్కృతిలో భాగంగా LCHF ఆహార శైలిని అవలంభించడం వల్ల 'ఎస్కిమోస్' లాంటి కొన్ని మానవ జాతుల్లో ఇప్పటికీ జీవనశైలి వ్యాధులు, క్యాన్సర్ మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ఉనికి లేకపోవడం మనం గమనించాలి.

ఊబకాయంపై జరుగుతున్న జాతీయ, అంతర్జాతీయ సదస్సులన్నీ కొన్ని వాక్యాలనే పదే పదే వల్లెవేస్తున్నారు. ఒకటి, వాతావరణ కాలుష్యమే ఊబకాయానికి కారణమని. రెండు, ఖర్చు చేసే శక్తి కన్నా తినేది ఎక్కువగా ఉండడమే బరువు పెరగడానికి కారణమని. జాతీయంగా, అంతర్జాతీయంగా పెరిగిపోతున్న నడుము కొలతల్ని తగ్గించాలంటే ప్రతిరోజు అధికంగా చేరుతున్న 100 కేలరీల అదనపు శక్తిని తగ్గించడానికి ఆహారాన్నైనా తగ్గించాలి, లేదా వ్యాయామమైనా పెంచాలన్నదే అందరి ప్రతిపాదన. "కేలరీల తగ్గింపు కాదు కేలరీల స్వభావం మారడం ముఖ్యమని" తేల్చిన పరిశోధకుల్లో ముందు వరసలో ఉన్న వ్యక్తులు గ్యారీ టాబ్స్ (Gary Taubes) మరియు డా॥ జాసన్ ఫంగ్ (Dr. Jason Fung).

**గ్యారీటాబ్స్ గురించి**

గ్యారీటాబ్స్ (30-4-1956) సైన్స్, ఆరోగ్య రంగాల్లో అంతర్జాతీయ పరిశోధనాత్మక జర్నలిస్టు. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, కొలంబియా విశ్వ విద్యాలయాల్లో బి.యస్., ఎమ్.ఎస్ (అప్లైడ్ ఫిజిక్స్, ఇంజనీరింగ్) చదివారు. జర్నలిస్ట్‌గా ప్రఖ్యాత అవార్డులు పొందిన గ్యారీటాబ్స్ కార్బోహైడ్రేట్లు చేసున్న కీడు, ప్రజారోగ్యం, కొలెస్ట్రాల్, పౌష్టికాహార విజ్ఞానం, చక్కెర వినియోగం - నష్టాలు వంటి ఎన్నో అంశాలపై ప్రామాణికమైన పరిశోధనాత్మక కథనాలు, విలువైన పుస్తకాలు రాశారు. డిస్కవర్, సైన్స్ లాంటి ప్రఖ్యాత అంతర్జాతీయ సైన్స్ మాగజైన్ల పాఠకులకు గ్యారీటాబ్ రచనలు చిరపరిచితాలే. వరసగా మూడుసార్లు అంతర్జాతీయ సైన్స్ రచయితల అవార్డు పొందిన ఈయన న్యూట్రిషన్ సైన్స్-ఇనిషియేటివ్ (NUSI)కు సహ వ్యవస్థాపకుడిగా ఆ సంస్థ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన, పొందుతున్న ఆయన పుస్తకాలు 1. Why we get fat, 2. The case against sugars, 3. Good Calaries, Bad Claries. మూడవ పుస్తకం LCHF Diet కు దిక్సూచి లాంటిది. ప్రతి పౌరుడు తప్పక చదవాల్సిన పుస్తకమిది.

దాదాపు 70 సంవత్సరాలకు పైగా కొవ్వుల ఆహారాలు, ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బులు, కాన్సర్లకు కారణమవుతున్నాయని వైద్య వర్గాలు, పౌష్ఠికాహార నిపుణులు చెపుతూ వచ్చారు. అందుకు అణుగుణంగా ప్రజలు కొలస్ట్రాల్ లేని నూనెలను (Refined Oils) వాడుతున్నారు. కొవ్వుల వినియోగం తగ్గింది. అయినా జీవనశైలి జబ్బులు తామర తంపరగా పెరిగిపోతున్నాయి. లోపం ఎక్కడుంది అన్న ఆలోచనలో పడ్డారు గ్యారీటాబ్స్. ఆయన్ని ఈ అంశంపై మరిన్ని పరిశోధనలకు ఉసిగొల్పింది. 5 సంవత్సరాలపాటు వేలాది పుస్తకాలను, జర్నల్స్‌ను శోధించడమే గాక వందలమందిని ప్రత్యక్షంగా కలసి చర్చించాడు. ఫలితాలు ఆశ్చర్యపరిచే విధంగా ఉన్నాయి. పరిశోధనలు ఒక రకమైన ఫలితాలను వెల్లడిస్తుంటే, దానికి భిన్నంగా ఒక వర్గానికి ప్రయోజనం చేకూర్చే సూత్రీకరణలకు కొందరు పరిశోధకులు పూనుకోవడాన్ని గుర్తించాడు. అందుకు కారణమేమిటో వెతికితే వాళ్ళను ప్రభావితం చేస్తున్నది కొత్తగా విస్తరించిన ఆహార పరిశ్రమ వర్గాలేనని ఆయనకు అర్థమైంది. ఆ వివరాలను వెల్లడి చేయడానికే "Good Calories - Bad Calories" అనబడే పుస్తకాన్ని వ్రాశారు.

శరీరంలో జరిగే జీవప్రక్రియల విషయాలను కూడా లోతుగా అధ్యయనం చేయడం ఫలితంగా ఈ పుస్తకానికి ఒక వైద్య గ్రంధపు స్వభావం వచ్చింది. ఇన్సులిన్ ప్రాముఖ్యతను శాస్త్రీయంగా వివరించారు. ఊబకాయం అతిగా తినడం వల్లనూ, శారీరక శ్రమలేని జీవన సరళివల్లనూ రావడం లేదన్నారు. మధుమేహం, గుండెజబ్బులు, కాన్సర్ గురించి కూడా ప్రచారంలో ఉన్న సంప్రదాయ వైద్య వర్గాల విజ్ఞానానికి భిన్నంగా పరిశోధనలు వెల్లడి చేసి వాస్తవాలను విశ్లేషిస్తూ వైద్య రంగానికే ఒక దిక్సూచి అయ్యాడు. (ఇంకా వుంది)

---

**భౌతికవాద తాత్త్విక విలువలకు, మానవీయ భావాలకు కట్టుబడి, ఎవర్నీ ఎన్నడూ నొప్పించకుండా అనుకోని పరిస్థితులతో పోరాడి తన జీవితాన్ని ముగించుకున్న మౌన మృదుస్వభావి**

## "చార్వాక"కు జోహార్లు!

ది. 11-06-2024 మంగళవారం ఉదయం 11 గంటలకు చార్వాకాశ్రమంలో "చార్వాక ప్రథమ వర్థంతి సభ" జరిగింది. ఈ సభకు నాస్తిక సమాజం నాయకులు కె. కోటేశ్వరరావు స్వాగతం పలుకగా – నాస్తిక సమాజం నాయకులు కె.బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు.

బెన్‌హర్‌బాబు మాట్లాడుతూ – 'చార్వాక' నిజాయితీగా, చిత్తశుద్ధితో చార్వాకాశ్రమ కార్యక్రమాలలో పాల్గొనేవాడనీ, కొంతకాలం విప్లవ కార్యాచరణ వైపు మొగ్గుచూపాడనీ, విద్య వైద్యం ప్రజలందరికీ ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వం వాటిని ప్రైవేటు వారికి అప్పజెప్పి సామాన్యుడికి అందకుండా చేసిన నేటి పరిస్థితులలో చార్వాక వైద్యునిగా పేదవారికి ఉచితంగా వైద్యం చేశాడని అన్నారు.

ఇంకా ఈ సభలో – బుద్ధభూమి వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య, ఆకురాతి రత్నారావు, నాస్తిక సమాజం నాయకులు జె. సత్యనారాయణ, సి.హెచ్ శివారెడ్డి, నల్లమోతు రామారావు, జయబాబు, బి. స్వతంత్రభారతి, దళిత స్త్రీ సాహిత్య పరిషత్ కన్వీనర్ బి.ఎమ్ లీలాకుమారి మొ॥వారు ఉపన్యసించారు.

# గాంధీ - భగత్‌సింగ్

- దివికుమార్

**(ఈ వ్యాసము "నా నెత్తురు వృథా కాదు" పుస్తకం నుండి గ్రహించడమైనది)**

(గత సంచిక తరువాయి)

"నిజమైన విప్లవశక్తులు గ్రామాల్లో, కార్ఖానాల్లో వున్నాయి. అవే రైతులు, కార్మికులు. మన బూర్జువా నాయకులు వాళ్ళని పోరాటంలోకి దింపరు. దింపే సాహసం చెయ్యరు కూడా. నిద్రపోతున్న సింహం ఒక్కసారి నిద్రలేంచిలేస్తే మన నాయకులు అనుకొన్న లక్ష్యం సాధించిన తర్వాత కూడా దాన్ని అదుపు చేయలేరు. అందుకే నేనంటాను–సంపూర్ణవిప్లవం ఎన్నడూ వారి లక్ష్యం కాదు. కనుక రాజకీయ చైతన్యం కలిగించడానికి జాతీయ రాజకీయాలే కాకుండా వర్గ రాజకీయాలను కూడా ప్రజలకు చెప్పాలి."

వర్గపోరాటానికి బదులు హృదయ పరివర్తనని, సోషలిజానికి బదులు ధర్మకర్తృత్వ సిద్ధంతాన్ని గాంధీ ప్రతిపాదించాడు. రౌండుటేబుల్ కాన్ఫరెన్సులో సామ్రాజ్యవాదులకు ఎటువంటి హామీలిస్తున్నాడో చూడండి.

"బ్రిటిషు సామ్రాజ్యవాదుల హృదయంలో భారతీయుల మీద ప్రేమ కలిగించేట్టు చేయటం మా కర్తవ్యం. వారి హృదయంలో ప్రేమ కలగటానికి వంద సంవత్సరాలు పట్టినా...కాంగ్రెసు ఓపిగ్గా వంద సంవత్సరాలూ ఎదురు చూస్తుంది." ('కాంగ్రెసు చరిత్ర' నుండి)

వాళ్ళు దేశసంపదల్నీ, శ్రమశక్తినీ బందిపోటు దొంగల్లా కొల్లగొట్టుకు పోతున్నా, జలియన్ వాలాబాగ్ దురంతాలు సాగించినా, అక్రమ కుట్రకేసులు బనాయించి అనేకమందిని ఉరితీసినా, లక్షలాది ప్రజానీకాన్ని చిత్రహింసలపాలు చేస్తూవున్నా బ్రిటీషువారి హృదయాలు పరివర్తన చెంది ప్రేమపూర్వకంగా స్వాతంత్ర్యం ఇచ్చేదాకా ఆగుతాడట!

సామ్రాజ్యవాదులకు పై రకపు హామీ ఇచ్చిన గాంధీ 1937లో ఉత్తరప్రదేశ్ జమీందారుల ప్రతినిధులు తనను కలుసుకోనటానికి రాగా ఎటువంటి హామీ లిచ్చాడో చూడండి.

"పెట్టుబడిదార్ల నుండి భూస్వాముల నుండి న్యాయమైన కారణమేదీ లేకుండా వారి భూమిని లేక పెట్టుబడులను లాగేసుకోవడాన్ని నేను అంగీకరించను. అలాంటి కార్యక్రమంలో నేనే విధమైన సంబంధమూ పెట్టుకోను మీరు నమ్మండి. నేను నా శక్తినంతా వినియోగించి వర్గపోరాటాన్ని నిరోధిస్తాను. అన్యాయంగా, అక్రమంగా మీ సంపదల్ని లాగేసుకొంటే నేను మీ రక్షణ కోసం నడుంకట్టి నిలబడతాను." (యశపాల్ –'రామరాజ్యం' నుండి)

వర్గపోరాటాన్ని పక్కదారి పట్టించి ధర్మకర్తృత్వం పేరుతో ధనికులను, భూస్వాములను కాపాడటమే గాంధీ సిద్ధాంతం. అందుకే బ్రిటిషు సామ్రాజ్యవాదులకు అన్ని రకాలుగా వత్తాసుగా వుంటూ, రైతాంగాన్ని భయంకరంగా దోచుకుంటూ, కరడుగట్టిన ఫ్యూడల్‌వ్యవస్థకు ప్రతినిధులుగా వున్న సంస్థానాలలో సాధ్యమయినంత ఆలస్యంగా జాతీయోద్యమానికి (అదీ తప్పనిసరి పరిస్థితులలో) పిలుపిచ్చాడు. వారిని రక్షించడానికి మరెన్ని విధాల బోధించాడో చూడండి:

"ఆస్తిపరులయినవారు (పేదలపాలిట ధర్మకర్తలుగా ప్రవర్తింపదలిస్తే నేను చాలా సంతోషిస్తాను. కానీ వారట్లు చేయని పక్షంలో వారి ఆస్తులను ప్రభుత్వశక్తి ద్వారా సాధ్యమయినంత

తక్కువ దౌర్జన్యప్రయోగంతో వశపరుచుకొనవలసి వుంటుందని భావిస్తాను.” (ధర్మకర్తృత్వ సిద్ధాంతం– శతజయంతి ప్రచురణలు–పేజీ 94)

మేకలకు కాపలాగా పులిని వుంచటమే ధర్మకర్తృత్వ సిద్ధాంతసారం, పులి ఆకలి వేసినప్పుడు మేకలను తిన్నా పులిని మాత్రం హింసించకూడదన్నదే ఆయన మతం. ఇది దోపిడీవ్యవస్థను సాధ్యమయినంత కాలం ఊపిరి పోసి నిలబెట్టే ప్రయత్నం తప్ప మరొకటికాదు. ఆ వ్యవస్థ ఫలితంగా ఎందరు ఆకలిచావులకు ఆహుతైనా, ఆత్మహత్యలకు బలయినా, ప్రభుత్వ హింసా దౌర్జన్యాలకు గురయినా అది మాత్రం ఆయనకు హింసగా కనపడదు.

గాంధీ నాయకత్వం చివరికి సామ్రాజ్యవాదులతో రాజీపడి దళారీ బూర్జువా భూస్వాముల పాలన నేర్పరుస్తాడనే అంచనాతోనే భగత్‌సింగ్ ఇలా హెచ్చరించాడు.

“భారతదేశ అధినేత లార్డ్ రీడింగ్ అయినా, సర్ పురుషోత్తమదాస్ ఠాకూర్‌దాస్ అయినా కార్మిక కర్షక జీవితాల్లో ఎటువంటి మార్పూ రాదు, లార్డ్ ఇర్విన్‌కు బదులు సర్ తేజ్ సప్రూ గద్దెనెక్కినా ఓ రైతుకు ఒరిగేదేమీ లేదు” అంటూనే హృదయపరివర్తన కోసం ఎదురు చూడకుండా ప్రజలే విప్లవంద్వారా రాజకీయాధికారాన్ని సాధించుకోవాలని చెప్పాడు.

“విప్లవం అంటే మన అభిప్రాయాలేమిటో చాలా స్పష్టం. ఈ దేశంలో విప్లవం అంటే కేవలం ఒకటే అర్థం. అది ప్రజలకోసం ప్రజలద్వారా రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవటం. ఇదే నిజమయిన విప్లవం అనిపించుకొంటుంది. మిగతా అన్ని ఉద్యమాలు కేవలం పైపై మెరుగులూ. గబ్బు కంపు కొడుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థని శాశ్వతం చేసే ప్రయత్నాలే. అందుకే తెల్ల బద్మాష్‌ల పరిపాలనను అంతమొందించి నల్ల బద్మాష్‌ల పరిపాలనను భరించడానికి ఎన్నడూ ఒప్పుకోం”

## గాంధీ చెప్పే అహింస యొక్క వర్గ స్వభావం

ప్రపంచాన్ని పునర్విభజించుకోవడానికి రెండు సామ్రాజ్యవాద కూటముల మధ్య మొదటి ప్రపంచయుద్ధం జరిగింది ఆ కాలంలోనే గదర్ వీరులు బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని సైనిక తిరుగుబాటు ద్వారా కూల్చివేయాలనే ప్రయత్నం చేశారు. భారతీయుల అభీష్టానికి విరుద్ధంగా భారత వైస్రాయి జర్మనీ మీద యుద్ధాన్ని ప్రకటించాడు. సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికవర్గాన్ని యుద్ధానికి సహకరించవద్దనే కాకుండా, దాన్ని అంతర్యుద్ధంగా మార్చి శ్రామిక విప్లవాన్ని తీసుకొచ్చి బూర్జువా పాలనని కూలదోయమని ప్రపంచ శ్రామికవర్గానికి లెనిన్ పిలుపునిచ్చి తన దేశంలో అలా చేసి చూపించాడు!

తన యుద్ధ ప్రయత్నాలకి ఒక వైపున భారతీయులపై నిర్భయంగా ఆర్థికపన్నులు విధించటమే కాక, మరోవైపు అసంతృప్తిని క్రూరంగా అణచివేస్తున్న పరిస్థితి. బ్రిటీషు పాలకులు ఇబ్బందుల్లో వున్న సమయాన్ని స్వాతంత్ర్య సాధనకు చక్కగా వినియోగించుకోవచ్చు. కానీ కాంగ్రెసు నాయకులు సామ్రాజ్యవాదులకు యుద్ధంలో సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గాంధీ అయితే లండన్ చేరి అక్కడి భారతీయ యువకులకు “సామ్రాజ్యవాద దృష్టితో ఆలోచించమని” బోధిస్తూ “సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొంటున్న ఈ విపత్కాలంలో, బ్రిటన్‌లో నివసిస్తూ కొంత సహాయం చేయగల శక్తి వున్న మావంటి కొందరం మా సర్వశక్తులను

బేషరతుగా ప్రభుత్వాధీనంలో వుంచడం భావ్యమని అనుకున్నాము. మేమూ, సంతకాలు చేసిన ఇతరులూ మా సేవలను ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని మనవి చేసుకుంటున్నాము" అని ప్రకటించాడు. ('మహాత్ముడు ఆయన సిద్ధాంతాలు'- నంబూద్రిపాద్) యుద్ధంలో క్షతగ్రాతులను మోసుకుపోవటానికి అంబులెన్స్ దళాల్లోకి స్వచ్ఛంద సేవకుల్ని సమీకరించి పంపించాడు.

ఆయన సేవల్ని మెచ్చిన వైస్రాయి 1917లో ఢిల్లీలో జరిగిన యుద్ధసభకు పిలిపించాడు. ఆ సభ నిర్ణయాలను గాంధీ బలపర్చి "గ్రామానికి ఇరవై మంది చొప్పున సైన్యంలో చేరాలి" అన్న నినాదంతో తన స్వంత రాష్ట్రమయిన గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో యువకుల్ని సైన్యంలోకి రిక్రూట్ చేసి సామ్రాజ్యవాదులకు బంటుగా వ్యవహరించాడు. తన చర్యలు సమర్ధించుకొంటూ "సామ్రాజ్యవాద రక్షణకై జరుగుతున్న యుద్ధంలో పాల్గొనడమే స్వరాజ్య సంపాదనకు సులభమయినమార్గం. సామ్రాజ్యం నశిస్తే దానితోపాటు మన ఆశలూ అంతరిస్తాయి" ("మహాత్ముడు-ఆయన సిద్ధాంతాలు - నంబూద్రిపాద్ - పేజీ 34) అన్నాడు. సైనికుల్ని రిక్రూట్ చేయటానికి వైస్రాయి ముందు గాంధీ పెట్టిన షరతు ఏమంటే ప్రచారోపన్యాసాలు హిందుస్తానీ భాషలోనే ఇవ్వాలని. దానిని ఎలాంటి తటపటాయింపులు లేకుండా వైస్రాయి అంగీకరించాడు.

ఆయన శాంతి కాముకత, హిందూ ముస్లిం ఐక్యత ఎంత మోసపూరితమో పెషావర్‌లో జరిగిన ఘటన రుజువు చేసింది.

ఉప్పుసత్యాగ్రహం కాలంలో శాసనోల్లంఘనకు, సంపూర్ణ స్వరాజ్య సాధనా ప్రతిజ్ఞలకు లక్షలాది ప్రజలు కదిలి వచ్చారు. పెషావరులో (ఇప్పుడు పాకిస్తాన్‌లో వుంది) అరెస్టులకు నిరసనగా గొప్ప ప్రదర్శనలు జరిగాయి. ఆవేశపూరితులై వున్న ప్రజలను లొంగదీయటానికి అధికార్లను కార్లలో పంపారు. ప్రజలు కార్లను తగులబెట్టారు. విచక్షణారహితంగా సైనికులు జరిపిన కాల్పులలో వందల మంది చనిపోయారు. గాయపడ్డారు. ఆ సమయంలో ఠాకూర్ చంద్రాసింగ్ నాయకత్వాన గల ఘర్వాలీ సైనికులు పెషావరులోని ముస్లిం ప్రజలను కాల్చటానికి నిరాకరించారు. సైనికులు ప్రజలతో కలసిపోయారు. రోజులపాటు పట్టణమంతా ప్రజల ఆధీనంలో ప్రశాంతంగా వుంది. తర్వాత బ్రిటిషు విమానదళం, సైన్యం ప్రవేశించి ఘర్వాలీ సైనికుల్ని అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించింది.

నిజానికి ఘర్వాలీ సైనికులు రక్తపాతానికి ఒడిగట్టకుండా శాంతిని కాంక్షించారు. ఘర్వాలీ హిందూ సైనికులే పెషావరు ముస్లిం ప్రజలను కాల్చి చంపినట్లయితే ఇంకోచోట ముస్లిం సైనికులతో హిందూ ప్రజలను సామ్రాజ్యవాదులే చంపించేవారు. ఆ విధంగా వారు దృఢమైన శాంతియుత పద్ధతులకు, హిందూ-ముస్లిం ఐక్యతకు సిద్ధపడటం చరిత్రలో లిఖించదగిన అత్యుత్తమ మతసామరస్య సంఘటన అని చెప్పవచ్చు.

సామ్రాజ్యవాదులకు నష్టం కలగని శాంతిని మాత్రమే కోరుకునే గాంధీ, ఘర్వాలీ సైనికుల చర్యలను తీవ్రంగా ఖండించాడు. "ప్రభుత్వం కాల్చమన్నప్పుడు సైనికులు కాల్చలేదంటే వాళ్ళు తమ కర్తవ్యాన్ని పాటించలేదనవలసి వుంటుంది. వాళ్ళు ప్రభుత్వ ఆజ్ఞల్ని తిరస్కరించారు కనుక అపరాధులవుతారు, శిక్షార్హులవుతారు" అని ప్రకటించాడు. ('నేటి భారతదేశం'-రజనీ పామీదత్తు) కనుకనే గాంధీ-ఇర్విన్ ఒడంబడికలో ఘర్వాలీ సైనికుల విడుదల ప్రస్తావన కూడా లేదు.

రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సుకి లండన్ వెళ్ళినప్పుడు ఈ విషయమే ఒక ఫ్రెంచి విలేఖరి గాంధీని ప్రశ్నించగా "నేను ప్రభుత్వోద్యోగులకు, సైనికులకు ప్రభుత్వ ఆజ్ఞల్ని ధిక్కరించమని చెప్పను. ఎందుకంటే ప్రభుత్వం మన చేతుల్లో కొచ్చిన తర్వాత మేమూ ఉద్యోగులచేతా, సైనికులచేతా పని చేయించవలసి వుంటుంది. ఇప్పుడు వాళ్ళని ప్రభుత్వ ఆజ్ఞల్ని భంగపరచమని ప్రోత్సహించానే అనుకోండి రేపు నా ఆజ్ఞల్ని కూడా వారు భంగపరుస్తారు గదా!"

తమ పరిపాలనలో కూడా ప్రభుత్వోద్యోగులు, సైనికులు విచక్షణాజ్ఞానంలేని కేవలం సేవకులుగా వుండాలన్నదే గాంధీ అసలు కోర్కె అని ఈ సంఘటనతో స్పష్టమవుతోంది.

ఆయన అహింస సామ్రాజ్యవాదులను, బూర్జువా భూస్వామ్యవర్గాలను రక్షించటానికే. పాలకుల యెడల అహింస, ప్రజల యెడల ధర్మకర్తృత్వం! ఇదీ ఆయన తత్వం. *(ఇంకావుంది)*

---

## హేతువాద సోదరా! కదనమునకు దూకరా!

హేతువాద సోదరా! కదనమునకు దూకరా!
పేదవాని గుండె సొదల రణదుందుభి మ్రోగెరా!
హేతువాద సోదరా! కదనమునకు దూకరా!
మన అన్నల చార్వాకుల పోరుబాట నడవరా
సామాజిక విప్లవాల బావుటెగుర వేయరా – 2 సార్లు ॥హేతువాద॥

కులమతాల సంకెళ్ళను ఛేదించను కదలరా
మౌఢ్య కుడ్య ప్రాకారం కూల్చివేయ నడవరా – 2 సార్లు ॥హేతువాద॥

భూమి నీరు గాలి నిప్పు సర్వులవని చాటరా
భూస్వామ్య వ్యవస్థ మీద తిరుగుబాటు చేయరా – 2 సార్లు ॥హేతువాద॥

శ్రమశక్తిని దోచుకునే ధనస్వామిక శక్తుల
పెట్టుబడుల పునాదులను పెకలించగ కదలరా – 2 సార్లు ॥హేతువాద॥
కాలెకడుపు కూలె గుడిసె పెనుమంటను చూడరా– 2 సార్లు ॥హేతువాద॥
ఆర్థిక పోరాటమె నీ ఊపిరిగా తలపరా
సాంఘిక పోరాటమె నీ ఊపిరిగా నడవరా ॥హేతువాద॥

పోరాడె శక్తులతో చేయి చేయి కలపరా
దోపిడి కూటమిని కూల్చివేయ నడవరా – 2 సార్లు ॥హేతువాద॥

సమసమాజ స్థాపనయే మన ధ్యేయం తమ్ముడా
సాధించే వరకు ఈ పోరు ఆగిపోదురా – 2 సార్లు ॥హేతువాద॥

# భారత చరిత్రలో అతిపెద్ద నాస్తిక ఉద్యమం

(2022 మార్చి 12, 13 తేదీలలో నిర్వహించిన 30వ జాతీయ నాస్తికమేళాలో
ప్రముఖ బౌద్ధ రచయిత **డి.చంద్రశేఖర్** ప్రసంగం)

**భా**రతదేశపు తత్వచింతన గురించి జరిగే చర్చలో, సాధారణంగా, దానిని వైదిక తత్వంతో ఆరంభించటం పరిపాటి. భారత ఉపఖండంలోకి ఆర్యులు అడుగుపెట్టక ముందు (ఇంచుమించు క్రీ.పూ. 1800 వరకు) అదొక 'చీకటిఖండం'గా ఉండేది. అంటే, ఆధునిక చరిత్రకారులు 'నాగరికత', 'సంస్కృతి' అని గుర్తించదగింది ఏదీ ఆనాటికి ఉపఖండంలో లేదు. ఆదిమ మానవుని తొలి నాగరికతకు చిహ్నాలైన స్థిరనివాసం, వ్యవసాయం, పనిముట్లు, చేతివృత్తులు, లిపి మొదలైనవి అన్నీ, అనాగరిక ఆదిమ భారత వాసులకు ఆర్యులు అందించినవే. అలాగే తత్వశోధన, ధార్మిక చింతన, నైతికత, విద్య, వైద్యజ్ఞానం, సహనశీలత, శాంతికాముకత, సోదరభావం ఇవన్నీ మనకు ఆర్యుల వరప్రసాదమే. క్లుప్తంగా చెప్పాలంటే, వేల సంవత్సరాలుగా ఈ నేలపై నెలకొని, వికసించి, 'భారతీయ'మైనవి అని పిలవబడే ప్రతిదీ ఆర్యుల ద్వారా 'దిగుమతి' అయిందే లేదా వారి ద్వారా సృష్టించబడిందే. – ఇది భారత చరిత్ర మరియు సంస్కృతి గురించి తరచూ వినిపించే "ఏకమూస ఆర్య సంస్కృతి" సిద్ధాంతం.

ఇది అప్పుడప్పుడు అరుదుగా వెల్లడయ్యే కొందరి వ్యక్తుల అభిప్రాయం మాత్రమే అనుకుంటే, మనకు అసలు సంగతి అర్థంకాదు. దీని నిజస్వరూపం ఏమిటో తెలుసుకోవాలంటే, గత 150 సంవత్సరాలుగా భారతదేశ చరిత్రను, ముఖ్యంగా దాని ప్రాచీన చరిత్రను, గ్రంథస్తం చేసిన తీరును లోతుగా పరిశీలించి చూడటం అవసరం. ఉపఖండంలో పాశ్చాత్యుల పాలన మొదలుకాక ముందు, ఈ దేశ చరిత్ర గురించి ప్రత్యేకంగా జరిగిన కృషి, రాసిన గ్రంథాలు చాల అరుదు అనేది జగమెరిగిన సత్యం. బ్రిటిష్ పాలనలోనే భారతచరిత్రను క్రమబద్ధంగా నమోదుచేసే పని మొదలైంది. చరిత్ర రచనకు రూపకల్పన జరుగుతున్న తొలిదశలో, ఆనాటి మేథోరంగంలో ప్రబలమైన శక్తిగా (నిజానికి ఏకైక శక్తిగా) ఉన్న వైదిక సంప్రదాయ వాదులు, చరిత్ర రచనపై తీవ్రమైన ప్రభావం చూపగలిగారు. వైదికవాదులు భారతదేశ చరిత్ర రచనను అంతర్లీనంగా నియంత్రించే ఒక 'నమూనా'ను రూపొందించి, విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చారు. ఈ వైదిక నమూనా యొక్క సంక్షిప్త రూపమే పై పేరాలోని ఆర్యసంస్కృతి వాదం. (మొదటి పేరాను మరోసారి పరిశీలనగా చదవండి).

ఈ నమూనాను ఊహాజనితమైన ఒక ప్రతిపాదనగా మాత్రమే చెప్పివుంటే, అది చరిత్ర రచనపై గణనీయమైన ప్రభావం చూపగలిగేది కాదు. కాని, వేదాలు క్రీ.పూ. 7,000 లేదా 10,000 సంవత్సరాల క్రితం కూర్చినవని కాకిలెక్కలు జోడించి, ఈ వైదిక నమూనాను ఒక చారిత్రిక సత్యంగా నిరూపించే బలమైన ప్రయత్నం జరిగింది (అది ఈనాటికీ జరుగుతూనే ఉంది). దీని ఫలితంగా, చాలామంది పాశ్చాత్య మరియు భారత చరిత్రకారులు ఈ ఉచ్చులో

చిక్కుకున్నారు. ఆర్యులు ఉపఖండంలో ప్రవేశించక ముందు, సుదీర్ఘకాలంగా ఇక్కడ నివసిస్తున్న ప్రజల జీవన స్థితిగతుల గురించి, దాదాపు ఏమీ తెలియని కాలంలో భారత చరిత్ర రచన మొదలయింది. చరిత్రను నిగ్గుతేల్చటంలో అత్యంత మౌలిక వనరుగా చెప్పబడే పురావస్తు పరిశోధన భారతావనిలో ఆనాటికి ఇంకా మొదలు కాలేదు. చరిత్ర రచనకు ఉపకరించే మరో ముఖ్యమైన వనరు సాహిత్యం. ఈ విషయంలో, తొలి తరానికి చెందిన చరిత్రకారులు వైదిక సంప్రదాయ సాహిత్యంపైనే పూర్తిగా ఆధారపడ్డారు. ఎందుకంటే, బౌద్ధం, జైనం వంటి వైదికేతర సంప్రదాయాలకు చెందిన సాహిత్యం ఆనాటి చరిత్రకారులకు ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇటువంటి పరిస్థితుల్లో, "ఏకమూస ఆర్య సంస్కృతి" సిద్ధాంతాన్ని ఆనాటి చరిత్రకారులు ఆమోదించక తప్పలేదు. వీటన్నిటి ఫలితంగా, వైదిక వాదులు రూపొందించి, ప్రచారంచేసిన నమూనాలోనే భారతదేశ చరిత్ర రచనకు పునాదులు ఏర్పడ్డాయి. సదరు నమూనాతో సరిపోలని, లేదా దానితో విభేదించే చారిత్రిక ఆధారాలు లభించినా, వాటిని అప్పటికే రూపొందిన చట్రానికి అనుకూలంగా మలచటం లేదా పూర్తిగా మరుగున పడెయ్యటం జరిగింది. (ఇటువంటి ప్రయత్నాలు ఈనాటికీ జరుగుతుండటం మనం చూడవచ్చు).

**చరిత్ర పరిశోధనలో కొత్తవెలుగు**

ఈ రీతిగా, చరిత్ర రచనకు సంబంధించి ఒక మూసకట్టు నమూనా లేదా "చట్రం" చాలకాలం పాటు తన 'సాధికారత'ను శక్తివంతం చేసుకుంటూ ముందుకుసాగింది. అయితే, 20వ శతాబ్దం మూడవ దశకంలో (1924– 26) భారతదేశ చరిత్ర పరిశోధనను మలుపుతిప్పిన ఒక సంఘటన జరిగింది. సింధూనది ఒడ్డున గల హరప్పా, మొహెంజొదారో అనే ప్రాంతాలను (ఇవి నేటి పాకిస్తాన్ దేశంలో ఉన్నాయి) తవ్వినప్పుడు, అక్కడ అత్యంత పురాతన నగరాలకు చెందిన శిధిలాలు బయటపడ్డాయి. వీటి ఆధారంగా, 1931లో సర్ జాన్ మార్షల్ తదితర పరిశోధకులు ప్రచురించిన "మొహెంజొదారో అండ్ ది ఇండస్ సివిలిజేషన్" అనే గ్రంథం, భారత ఉపఖండంలో విలసిల్లిన అత్యంత పురాతనమైన సింధునది నాగరికతకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. దీనితో చరిత్రకారులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

పురాతన భారత చరిత్ర గురించి చీకటిలో పెనుగులాడుతున్న చరిత్రకారులు చేతికి వెలుగుదివ్వె దొరికినట్లయింది. ఆర్యసంస్కృతి క్రీ.పూ. 7,000 లేదా 10,000 సంవత్సరాల నాటిదని స్వామి వివేకానంద, బాలగంగాధర తిలక్ తదితర వైదిక వాదులు ప్రచారం చేసిన కట్టుకథలకు, పుక్కిటి పురాణాలకు కాలంచెల్లింది. ఆనాటి వరకు చరిత్రకారుల్లో చెలామణిలో గల ఆర్య లేదా వైదిక నమూనా, ఇక ఎంతమాత్రం చెల్లుబాటు కాదని తేలిపోయింది.

ఈ సందర్భంలో, హరప్పా, మొహెంజొదారో ప్రాంతాల్లో బయల్పడిన శిధిలాలు ఏమి చెబుతున్నాయి? వాటి ఆధారంగా చరిత్రకారులు స్థూలంగా అంగీకరించిన ముఖ్యమైన విషయాలు ఏమిటి? అనే విషయాలను క్లుప్తంగానైనా చెప్పుకోవటం అవసరం.

సింధూనది పరిసర ప్రాతాలల్లో క్రీ.పూ. 2,600 సంవత్సరాల క్రితం హరప్పా, మొహెంజొదారో రెండు నగరాలు నెలకొని దీర్ఘకాలం కొనసాగాయి (వీటి పరిసరాల్లో ఇటీవల

ఆకాలం రాఖిగరీ అనే చోట మరో నగరం బయల్పడింది). భవన నిర్మాణము, నగరాలు రూపకల్పనకు (town planning) అవసరమైన ఇంజినీరింగ్ పరిజ్ఞానం ఈ నాగరికతలో ఉంది. కాల్చిన ఇటుకలతో నిర్మించిన భవనాలు, భవన సముదాయాలు, పెద్ద ధాన్యాగారాలు, విశాలమైన రహదారులు ఈ నగరాల్లో ఉన్నట్లు కచ్చితమైన రుజువులు లభించాయి. వీటిలో ఇటుకలతో నిర్మించిన మురుగునీటి కాలువలు కూడా ఉన్నాయి. ఇలాంటి పటిష్టమైన మురుగునీటి సదుపాయం ప్రపంచ చరిత్రలోనే మొదటిదని చరిత్రకారులు చెబుతున్నారు; మట్టి, రాగి, ఇత్తడి, సీసం, తగరం వంటి లోహాలతో చేసిన పాత్రలు, పనిముట్లు విరివిగా వాడుకలో ఉన్నాయి. రంగురాళ్ళు పూసలు పొదిగిన ఆభరణాలు, పింగాణి పాత్రలు ఆనాటి ప్రజల నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచాయి. ఈ నాగరికతలో నివసించిన ప్రజలు నావల ద్వారా సుదూర ప్రాంతాల్లోని (నేటి ఇరాక్) ప్రజలతో వ్యాపార సంబంధాలు కలిగివున్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి. ఇక్కడ దొరికిన రాతిశాసనాలు, లోహఫలకాలు, నాణేలు, ముద్రికలను బట్టి, ఆనాడు లిపి విస్తృతంగా వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. ఆనాటి ప్రజల్లో ధార్మిక చింతన బలంగా ఉందని రుజువుచేసే అనేక చిహ్నాలు లభించాయి.

పైన పేర్కొన్నవేగాక, సింధులోయలో లభించిన అనేక ఇతర ఆధారాలను బట్టి, ఆ ప్రాంతంలో అత్యంత ప్రాచీన నాగరికత నెలకొని, దీర్ఘకాలం పాటు కొనసాగిందని చరిత్రకారులు నిర్ధారించారు. భారత ఉపఖండంలో అనాదిగా నివసిస్తున్న ప్రజలు ఈ నాగరికతను నిర్మించారని, దీనికి ఆర్యులతో ఏవిధమైన సంబంధం లేదని తేల్చిచెప్పారు. దీనితో, క్రీ.పూ. సుమారు 1800 ఏళ్ల క్రితం ఉపఖండంలో ప్రవేశించిన మొరటు సంచార తెగల వారయిన ఆర్యుల కంటే, ఉపఖండంలో ఆనాడు జీవించిన స్థానిక ప్రజలు నాగరికతలో వేల సంవత్సరాలు ముందున్నారని చరిత్రకారులు చెబుతున్నారు.

గత 90 సంవతరాలుగా అటు పాకిస్తాన్‌లో, ఇటు భారతదేశంలోని పంజాబ్, హర్యాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో జరిపిన పురావస్తు పరిశోధనల్లో, సింధు నాగరికతను పోలిన అనేక చిహ్నాలు లభించాయి. దీన్నిబట్టి, అది చాలా విశాలమైన ప్రాతాలకు వ్యాపించినట్లు చరిత్రకారులు నిర్ధారించారు. ఈ విధంగా, భారత ఉపఖండంలో ప్రాచీనకాలపు జీవన విధానం, ఆర్థిక కార్యకలాపాల గురించి అనేక విషయాలు మనకు తెలిశాయి. ప్రత్యేకించి సింధు నాగరికతకు సంబంధించిన సమాచారం పాఠ్యపుస్తకాల్లో కూడా చోటు సంపాదించింది. కాని, ఆనాటి ప్రజల బౌద్ధిక కార్యకలాపాలు, తత్వచింతన గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. ఇందుకోసం మనం చదురుమదురుగా లభించే సమాచారం ఆధారంగా ఒక అంచనాకు రావలసిందే.

**సనాతన శ్రమణ ప్రవంతి**

ఆర్యుల తొలి గ్రంథంగా చెప్పబడే ఋగ్వేదంలో అర్యేతరులైన చింతనాపరుల గురించి అక్కడక్కడ కొన్ని ప్రస్తావనలు ఉన్నాయి. ఉదాహరణకు, దానిలో వర్ణించబడిన 'పసుపు వస్త్రాలు ధరించిన సంచార సన్యాసి' (X-136) ఆర్యులకు తారసపడిన మూలవాసి అని పరిశోధకులు నొక్కిచెబుతున్నారు. ప్రత్యేకించి క్రీ.పూ. 6వ శతాబ్దిలో వైదికేతరమైన అనేక తాత్విక మరియు ధార్మిక చింతనలు విరివిగా ప్రాచారంలో ఉన్నాయని జైన, బౌద్ధ గ్రంథాల్లో స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నాయి.

బుద్ధుని సమకాలికులైన 'ఆరుగురు గురువులు' వైదికవాదులు కారు. వీరు వేదాలను జ్ఞాన ప్రమాణంగా స్వీకరించటానికి నిరాకరించారు. వారిలో ఒకరైన మహావీరుడు ఇరవైనాలుగో తీర్థంకరుడని జైన గ్రంథాలు ప్రకటించాయి. అంటే, జైన సంప్రదాయంలో ఆయనకు ముందు ఇరవైమూడు మంది తీర్థంకరులు (మహాగురువులు) ఉన్నారని చెబుతున్నారు. అదెలావున్నా, ఇరవైమూడో తీర్థంకరుడైన పార్శ్వనాథుడు, మహావీరుని కంటే రెండు వందల సంవత్సరాల క్రితం జీవించినట్లు ఆధారాలున్నాయి. ఇదేరీతిలో, గౌతమ బుద్ధునికి పూర్వం ఆరుగురు బుద్ధులు ఉన్నారని మూల బౌద్ధగ్రంథాలు చెబుతున్నాయి.

పైన పేర్కొన్న వివరాలనుబట్టి చూస్తే, భారత ఉపఖండంలో సుదీర్ఘకాలంగా వైదికేతరమైన ఒక తాత్విక –ధార్మిక స్రవంతి ఉనికిలో ఉన్నట్లు తెలుస్తుంది. దీని చిహ్నాలు సింధునాగరికతలో ఉన్నాయని చెప్పటానికి రేఖామాత్రమైన ఆధారాలు ఉన్నాయి. (ఈ విషయాన్ని నిరూపించటానికి ఇంకా తగిన ఆధారాలు లభించలేదు.) అయితే, క్రీ.పూ. 8వ శతాబ్దం నుండి వైదికేతర తాత్విక స్రవంతి జాడలు కనిపిస్తున్నాయి. ఇక జైన, బౌద్ధ శాఖలు మొదలైన క్రీ.పూ. 6వ శతాబ్ది నుండి దీని ఉనికి గురించి బలమైన రుజువులు లభించాయి. అయినప్పటికీ, ఆధునిక చరిత్రకారుల రచనల్లో ఈ వైదికేతర చింతనా స్రవంతి, ఒక స్వతంత్రమైన బౌద్ధిక స్రవంతిగా గుర్తింపు పొందకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. బుద్ధుని ముందునాటి వైదిక గ్రంథాల్లో శ్రమణుల ప్రస్తావన ఉంది. బృహదారణ్యక ఉపనిషత్ (4.3.22), తైత్తిరీయ ఆరణ్యక (2.7) వంటి గ్రంథాలు శ్రమణుల గురించి మాట్లాడాయి. శ్రమణులు తమకు 'పరాయి' వారనే భావం ఈ వైదిక గ్రంథాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. బుద్ధుని బోధనలను యథాతథంగా నమోదు చేశాయని చెప్పబడే పాలి నికాయాలు మరియు సంస్కృత ఆగమాల్లో, ఆనాటి (కీ.పూ. 5వ శతాబ్ది) తాత్వికరంగంలో కృషిచేస్తున్న వారిని ఉమ్మడిగా సూచించటానికి "శ్రమణ–బ్రాహ్మణ" అనే జంటపదాలను ఉపయోగించారు. ఈ పదబంధం ఎక్కడో అరుదుగా గాక, బౌద్ధ సాహిత్యం అంతటా తరచుగా కనిపిస్తుంది. ఇదేరీతిలో, ఆనాడు బ్రాహ్మణేతరులైన సత్యాన్వేషకులను (అజీవకులు, జైనులు, బౌద్ధులు, లోకాయతులు మొదలగు వారిని) సూచించటానికి, సంబోధించటానికి "శ్రమణ" అనే పదం విరివిగా వాడుకలో ఉంది. బౌద్ధ గ్రంథాల్లో బుద్ధుణ్ణి, జైనగ్రంథాల్లో మహావీరుణ్ణి "మహాశ్రమణ" అని సంబోధించటం కనిపిస్తుంది. (వైదికులను సూచించటానికి 'శ్రమణ' అనే పదం ఎక్కడా వాడుకలో లేదు.)


క్రీ.శ. 629 నుండి 645 వరకు భారతావనిలో పర్యటించిన చైనీయుడైన బౌద్ధభిక్షువు హుయన్త్సాంగ్, తన రచనల్లో బౌద్ధభిక్షువులను "శ్రమణులు" అని సంబోధించాడు. అలాగే, ఆనాటి బౌద్ధులు తమను తాము శ్రమణులని చెప్పుకుంటున్నట్లు ఆయన రచనలు తెలియజేస్తున్నాయి.

ఈ ప్రకారంగా వైదిక సంప్రదాయానికి వెలుపల, దానికి సమాంతరంగా, శ్రమణులు ఒక తాత్విక స్రవంతిగా కొనసాగారని చెప్పటానికి బలమైన ఆధారాలు కనిపిస్తున్నా, భారత తాత్విక చరిత్రను పరిశోధించిన చరిత్రకారులు చాలామంది, దీన్ని ఒక స్రవంతిగా లేదా సంప్రదాయంగా గుర్తించకపోవటం శోచనీయం. ఈ వ్యాసం మొదటి పేరాల్లో వివరించిన వైదిక నమూనాలోని "ఏకమూస ఆర్యసంస్కృతి" సిద్ధాంతం చరిత్రకారులపై బలమైన ప్రభావం చూపిందని చెప్పటానికి ఇదొక నిదర్శనం.

ప్రముఖ అమెరికన్ ఇండాలజిస్ట్, ఫ్రాంక్లిన్ ఎజెర్టన్ శ్రమణులను 'బ్రాహ్మణేతరమూలాలు గల అసాధారణమైన సంప్రదాయం'గా గుర్తించాడు [Dominant Ideas in the Formation of Indian Culture, 1942). తరువాత 1978లో, జి.సి. పాండే శ్రమణ సంప్రదాయంపై "శ్రమణ ట్రెడిషన్" అనే పరిశోధక పత్రాన్ని ప్రచురించారు. భారతదేశ చరిత్రలో సుదీర్ఘంగా సాగిన బౌద్ధిక–తాత్విక పరంపర ఉందని గుర్తించిన థామస్ విలియం రీస్ డేవిడ్స్ (1843– 1922). అది ప్రపంచ చరిత్రలోనే సాటిలేని తాత్విక సంప్రదాయమని చెబుతూ ఇలా అన్నాడు:

"ధార్మిక విషయాల పట్ల ఇంతటి చిత్తశుద్ధి లేదా అంకితభావంతో సాగిన ఇటువంటి నిరంతర కృషి (ప్రపంచంలో) మరెక్కడా కనిపించదు. ఇంతటి చింతనా స్వేచ్ఛ, బాహ్య ప్రభావానికి ఇంత తక్కువగా గురయిన మత పరిణామం మరెక్కడా లేదు. ..... ఆదిమ విశ్వాసాల ముతక ఊహల నుండి మహోన్నతమైన భావనలకు బాటలు వేసి, సర్వాంగ సుందరమైన భారతీయ సత్యసౌధపు చిత్రాన్ని తీర్చిదిద్దిన, స్వతస్సిద్ధమైన మేథావుల విభిన్న ధోరణులు మరియు ప్రేరణలతో కూడిన ఇంతటి సమగ్ర స్వరూపం మరెక్కడా కనిపించదు" ది హిస్టరి అండ్ లిటరేచర్ అఫ్ బుద్ధిజం, 1896).

ఈ వ్యాఖ్యలో వైదిక, శ్రమణ సంప్రదాయాల మధ్య తేడాను గుర్తించకపోయినా, ప్రాచీన భారత తత్వచింతన గురించి రీస్ డేవిడ్స్ చాలా సమగ్రంగా, చక్కగా చెప్పాడు. నిజానికి, అయన చెప్పిన వర్ణన శ్రమణ సంప్రదాయానికి అన్ని విధాలా సరిపోతుంది. ప్రపంచ తాత్విక చరిత్రలోనే మహోన్నతమైనదిగా ఎన్నదగిన శ్రమణ సంప్రదాయాన్ని అధ్యయనం చెయ్యకుండా, భారత తాత్విక చింతనను వాస్తవికంగా అర్థంచేసుకోటం సాధ్యంకాదు. అంతేకాదు, మొత్తం మానవ తత్వశాస్త్రాన్ని అధ్యయనంలో ఇది ఒక నిరాకరించదగని వనరు అని చెప్పటం అతిశయోక్తి కాదు. శ్రమణ సంప్రదాయాన్ని ఒక స్వతస్సిద్ధమైన (original), సమగ్రమైన బౌద్ధిక–తాత్విక ధార్మిక స్రవంతిగా గుర్తించటానికి, దాని విశిష్టతను, విస్తృతిని, లోతును, ప్రయోజనాన్ని అర్థంచేసుకోవటానికి, శ్రమణ మరియు వైదిక సంప్రదాయాలను తులనాత్మకంగా పరిశీలించటం అవసరం. ఈ దిశగా కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలిద్దాం. (ఇంకావుంది)




చదవండి! చదివించండి!!

**తత్త్వశాస్త్ర చరిత్ర**

**గతితార్కిక భౌతికవాదం**

**వెల : రూ.120**

**ప్రతులకు :**

**బి. సుధాకర్**
**చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),**
**మంగళగిరి (మండలం)**
**గుంటూరు జిల్లా – 522 503.**
**సెల్ : 9290619550, 9440101814**

# మారిన మనస్సు!

– మా.శ్రీ.రాజు

**పొ**లం పనులు ముగించుకొని, పోలయ్య ఇంటి దారి పట్టాడు. ఒక వ్యక్తి ఎదురుగా వచ్చి "నమస్కారమండి నా పేరు సోమయ్య. నాది పక్క ఊరు సోమాపురం. దేవుడికి గుడి కట్టిస్తున్నాను. మీరు ఈ ఊరిలో పెద్ద రైతని తెలిసి, ముందుగా మీదగ్గరకే చందాకి వచ్చాను" అన్నాడు. "ఒక్క రూపాయి కూడా ఇవ్వను" ఖరాఖండిగా అని పోలయ్య ముందుకు కదిలాడు. సోమయ్య బిక్క చచ్చిపోయి, ఎంతో బతిమిలాడాడు. పోలయ్య, సోమయ్య మాటలు ఏం వినిపించుకోకుండా ముందకే నడిచాడు.

అంతలో ఒక వ్యక్తి పోలయ్యకి ఎదురుగా వచ్చి, నమస్కరించాడు. పోలయ్య కూడా చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేసి "ఏం రామయ్యా బాగున్నావా? చందాకోసం వచ్చావా? ఇవిగో తీసుకో" అని పోలయ్య తన జేబులో నుంచి, డబ్బులు తీసి, లెక్కపెట్టి, అతని చేతిలో పెట్టాడు. డబ్బులు తీసుకున్న రామయ్య, పోలయ్యకి మరోసారి వినయంగా నమస్కరించి, పక్కకు తప్పుకున్నాడు. పోలయ్య కూడా అభిమానంగా మళ్ళీ నమస్కారం చేసి, సంస్థ పరిస్థితి గురించి తెలుసుకొని, పోలయ్య అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

సోమయ్య ఆశ్చర్యపోయి హుటాహుటిన రామయ్య దగ్గరకువెళ్ళి "ఎవరు మీరు? ఆయన మీకు ఎందుకు డబ్బులు ఇచ్చారు? ఎంత ఇచ్చారు?" అని ప్రశ్నించాడు. "నా పేరు రామయ్య. నేను అనాథశరణాలయం నడుపుతున్నాను. దానికి ఆ ఊరి పెద్ద పోలయ్యగారు ప్రతి నెలా వెయ్యి రూపాయలు ఇస్తూ, మా సంస్థని ఎన్నో విధాలుగా ఆదుకుంటున్నారు. ఇప్పుడు కూడా అలాగే వెయ్యిరూపాయలు ఇచ్చారు. మీరు కూడా దయజేసి, మీకు తోచినంత ఇవ్వండి" అన్నాడు రామయ్య.

"అయ్యా! పోలయ్యగారి గొప్పతనం తెలియక, ఆయన చందా ఇవ్వకపోయేసరికి, మనస్సులో ఆయన్ని ఇప్పటిదాకా బాగా తిట్టుకున్నాను. నన్ను చూడగానే ఆయన నన్ను దొంగ వెధవని గుర్తించినట్లున్నారు. నిజమే నేను దొంగ వెధవనే. నేను గుడి కట్టటంలేదు. గుడిపేరు చెప్పి, ఊరు ఊరు తిరిగి చందాలు వసూలు చేసి, జల్సా చేసుకుంటున్నాను. నాకు ఇప్పుడు బుద్ధొచ్చింది. నేను ఎంత తప్పు చేస్తున్నానో ఇప్పుడు నాకు బాగా తెలిసివచ్చింది. ఇవిగోండి నేను పోగుచేసిన డబ్బంతా మీకు ఇస్తున్నాను. ఆ అనాథల్ని కంటికి రెప్పలా కాపాడుకొండి" అని సోమయ్య తను పోగుచేసిన డబ్బంతా రామయ్యకి ఇచ్చేసాడు.

"అయ్యా! మీరు ఎవరో, ఇప్పుడు మీ తప్పు మీరు తెలుసుకున్నారు. చాలా సంతోషం. దేవుడి పేరుతో డబ్బులు వసూలు చేసి, లేని దేవుడికి ఖర్చుపెట్టినా తప్పే. దేవుడి పేరుతో డబ్బులు వసూలు చేసి, ఒక వర్గం వారు తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. ఇది ఇంకా ఘోరమైన తప్పు, ఎందుకంటే ప్రజలకి ఊరికే డబ్బులురావు. వాళ్ళు అష్టకష్టాలు పడి, గొడ్డు చాకిరి చేస్తేనే వస్తాయి. ఎవరి కష్టార్జితాన్ని ఎవరూ దోచుకోకూడదు. లేని దేవుడు కాదు. ఉన్న మనుష్యులు ముఖ్యం. ఉన్న మనుష్యుల కష్టాలు ముఖ్యం. ఉన్న మనుష్యుల కష్టాలు తీర్చటం ముఖ్యం. ఎవరైనా ఇచ్చినా, ఎవరైనా వసూలు చేసినా, లేని దేవుడికోసం ఖర్చు పెట్టకూడదు. ఉన్న మనుష్యుల కష్టాలు తీర్చటానికి ఖర్చు పెట్టాలి. ప్రాణం లేని బొమ్మ దేవుడుకాదు. ప్రాణం వున్న, ప్రజాక్షేమం కోసం పాటుపడుతున్న మనిషే దేవుడు. ఇతరుల బాగుకోసం ఇప్పుడు మీరు ఇంత డబ్బు ఇస్తున్నారు. ఇప్పుడు మీరు కూడా దేవుడే" అని రామయ్య వినయంగా చేతులు జోడించి సోమయ్యకి నమస్కరించాడు.

సోమయ్య ఆనందంతో పరవశించి పోయాడు. తన జీవితంలో మొదటిసారిగా పొందిన నమస్కారం ఇదే. ఇతరుల్ని ఆదుకోవడంలో ఇంత ఆనందం వుంటుందని, మొదటిసారిగా తెలుసుకున్న సోమయ్య, రామయ్యకి వినయంగా ప్రతి నమస్కారం చేసి "అయ్యో అంత మాట అనకండి. నేను మామూలు మనిషిని. ఇప్పుడే మారిన మనిషిని. ఇగ నుంచి కష్టపడి పని చేసి సంపాదించుకుంటాను. నా కష్టార్జితంతో బ్రతుకుతాను. ఇతరుల కష్టాలలో పాలు పంచుకుంటాను. ఇతరుల కష్టాలు పోగొడతాను. వెళ్తున్నానండి" అని మారిన మనస్సుతో. తన మనస్సు మార్చిన పోలయ్యని, మనస్సులోనే ఎంతో మెచ్చుకుంటూ, తన ఊరు సోమాపురం వైపు, కష్టపడి పని చేసుకొని బ్రతకటానికి సోమయ్య వెళ్ళిపోయాడు.

---

# అమెరికా-భారత్ మధ్య వ్యాపార సంబంధాలు - ఒక పరిశీలన

**- యం.వి. కృష్ణయ్య**

**ది.** 22-05-2004న భారత్‌లో, అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టితో, భారత - అమెరికా సంబంధాలపై సుదీర్ఘమైన ఇంటర్వ్యూ ప్రచురించబడింది. అందులో అమెరికా భారత్ సంబంధాలకు ఆకాశమే హద్దనీ. ఈ సంబంధాలు ఉభయతారకమనీ, బారత-అమెరికాల భాగస్వామ్యం ప్రపంచానికే భాగ్యదాయకమనీ, భారత్‌లో అవకాశాలు పుష్కలమనీ, వాటిని అందిపుచ్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామనీ, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్ వేగంగా అభివృద్ధిచెందుతున్న శక్తి అనీ, ఇంకా ఏవేవో చెప్పేడు. ఆ ఇంటర్వ్యూ చూశాక అసలు నిజంగా భారత-అమెరికాల మధ్య ఏంజరుగుతుందో, ఇందులో లాభమెవరికో? నష్టమెవరికో? తెలుసుకోవాలనే ఉద్దేశంతో చేసిన ఓ చిన్న పరిశీలన మీముందు ఉంచుతున్నా!

## అమెరికా బోయింగ్ విమానాల కొనుగోలు :

2023 ఫిబ్రవరి 14న టాటా సన్సు చేతిలోని ఎయిరిండియా - అమెరికాకు చెందిన బోయింగ్ ఎయిర్ క్రాఫ్ట్‌ల మధ్య $100 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. ఇందులో ఫ్రాన్సుకూ, బ్రిటన్‌కూ వాటా ఉంది. భారత్‌తో ఈ ఒప్పందం జరిగిన తరువాత అమెరికా, ఫ్రాన్సు, బ్రిటన్‌లలో, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. 2022 ఫిబ్రవరి 14న అమెరికా అధ్యక్షుడు, జో బైడెన్ వైట్‌హౌస్ అధికారిక వెబ్‌సైటులో ఎయిరిండియా-బోయింగ్ ఎయిర్ క్రాఫ్టుల చారిత్రక కొనుగోలుపై ఓ ప్రకటన విడుదల చేశారు!

*ఆ ప్రకటన ఇలా సాగింది!*

"the United States can and will lead the world in manufacturing. I am proud to announce today the purchase of over 200 American-made aircraft through a historic agreement between Air India and Boeing. This purchase will support over one million American jobs across 44 states and many will not require a four-year college digree.This anouncement also reflects the strength of the U.S-India econamic

partnership. Together with Prime Minister Modi, I took farword to depending our partanership even further as we continue to confront shared global challenges-creating a more secure and prospeous future for all of our citizens"

ఇందులో ఆర్థిక భాగస్వామ్యం ఏమైనా ఉందా? ఇరువురూ కలసి విమానాలు తయారు చేయలేదే. వారు ఉత్పత్తిదారులు మనం వినియోగదారులు అంతేగదా? ఇక్కడ భారత విదేశీ మారక ద్రవ్యం $ 100 బిలియన్ డాలర్లు అమెరికా ఫ్రాన్సూ, బ్రిటన్‌ల ఆర్థిక వ్యవస్థలోకి చేరుతాయి. మనం విదేశీ మారకద్రవ్య నిల్వలు $100 బిలియన్ల లోటు ఏర్పడుతుంది. అమెరికాలో, ఫ్రాన్సులో, యుకెలో భారీ ఉద్యోగ కల్పన జరుగుతుంది. బైడన్ చెప్పినట్లు డిగ్రీ పాస్ కాని అమెరికా యువతకూ ఉపాధి లభిస్తుంది.

## యఫ్–16, యఫ్–18 యుద్ధ విమానాలు కొనుగోలు :

కొంచెం వెనక్కి వెళ్ళి ట్రంపు హయాంలో 2017 లో భారత్‌కు అమెరికా యఫ్ –18/ యఫ్ –16 విమానాల సరఫరా ఉదంతం పరిశీలిద్దాం. ఇవి బోయింగ్, లాక్ హీడ్ మార్టిన్ ఉత్పత్తులు. ఈ ఆధునిక యుద్ధ విమానాలను, సాధారణంగా అమెరికాకు, వ్యూహాత్మక స్నేహంగల నాటో, ఇజ్రాయిల్‌లాంటి దేశాలకు మాత్రమే సరఫరా చేస్తారు. అయితే ఇవి సరఫరా చేసినందువల్ల అమెరికా ఆర్థికవ్యవస్థకు అమెరికాకు సైనికంగా, అమెరికా యువతకు ఉపాధి విషయంలో కలుగబోయే ప్రయోజనాలను దక్షిణ ఆసియా వ్యవహారాల కార్యదర్శి అలైస్ వెల్స్ అమెరికన్ కాంగ్రెసుకు సవివరమైన నివేదిక సమర్పించింది. ఈ వివరాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. వివరాలలోకి వెళితే, ఈ ఆధునిక విమానాల సరఫరా ద్వారా భారత్ అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా, ఉంటుందనీ, ఆసియా ఫసిఫిక్ సముద్ర ప్రాంతంలో 90,000 నౌకలు పయనిస్తుంటాయనీ, వాటికి భారత రక్షణ దళాలే రక్షణ కల్పిస్తాయనీ, ఈ ప్రాంతంగుండానే ప్రపంచంలోని చమురు సరఫరాలో 2/3వంతులు జరుగుతుంటాయనీ, భూగోళంలోని సగం జనాభా ఇక్కడే నివసిస్తున్నారనీ, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలూ ఇక్కడే ఉన్నాయనీ ఇది అమెరికా ఆర్థిక సైనిక ప్రయోజనాలకు ఆధిపత్యానికీ అతికీలకమైనదనీ, 7 దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో కొనసాగుతున్న అమెరికా ఆధిపత్యం కొనసాగాలంటే మనకు ఓ నమ్మకమైన మిత్రుడు కావాలనీ, ఆ మిత్రుడు భారత్‌యేననీ, భారత్‌కు ఆయుధాలిచ్చి ఆ ప్రాంతంలో అమెరికా నౌకలకు రక్షణ ప్రదాతగా నిలపడంలో భాగంగానే ఈ యుద్ధ విమానాల సరఫరా, అనీ ఈ యుద్ధ విమానాలూ, ఇతర సరుకులూ భారత్‌కు సరఫరా చేయడం ద్వారా అమెరికాలోని 50 రాష్ట్రాలలో 2,60,000 ఉద్యోగాలకు మద్దత్తు లభిస్తుందనీ ఆమె కాంగ్రెస్‌కు తెలిపింది. అంటే మనం అమెరికాకు డబ్బు చెల్లించుకొనే ఆయుధాలతో, అమెరికా సామ్రాజ్యవాద వ్యూహంలో పావుగా, తన చేతికి రక్తం అంటకుండా అమెరికాకు సేవచేస్తుందనీ. పైగా అమెరికా ఆర్థిక వ్యవస్థలోకి బిలియన్ల డాలర్లు ఈ విమానాల కొనుగోలు ద్వారా ప్రవహిస్తాయనీ, అమెరికా యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనీ స్పష్టమవుతోంది. అంతేగాదు కొద్ది కాలం క్రితం భారత్‌కు చెందిన స్పైస్ జెట్ అనే ప్రయివేటు ఎయిర్ లైనర్సు $23 బిలియన్ల విలువైన

155 పౌర విమానాలను కొన్నదనీ, ఈ లావాదేవీల వల్ల అమెరికాలో 1,30,000 ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతాయనీ, జెట్ ఎయిర్ వేస్ 75 విమానాలు ఆర్డర్ చేసిందనీ ఆమె యు.యస్ కాంగ్రెస్‌కు తెలిపింది.

అంతేకాదు అమెరికాలో పనిచేస్తున్న 100 భారతీయ సంస్థలు అక్కడ $18 బిలియన్ల పెట్టుబడి పెట్టేయనీ ఇవి 1,13,000 ఉద్యోగాలనూ కల్పించాయనీ ఓ ప్రభుత్వ వార్షిక నివేదిక (15/11/2017) వెల్లడించింది.

పై ఉదంతాలన్నీ పరిశీలించినపుడు ఒక విషయం స్పష్టమవుతోంది. అమెరికా బ్రిటన్ ఫ్రాన్సులాంటి దేశాలలో, పాలకుల మనుగడ నిరుద్యోగ సమస్య పరిష్కారం మీద ఆధారపడి ఉందనీ, తమ ఆధునిక విమానాలూ టెలికాం న్యూక్లియర్ సామగ్రి, యుద్ధ పరికరాలూ అమ్ముకోవడం ద్వారా, తమ దేశాలలో యువతకు ఉపాధి, తమ ఆర్ధిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవడమూ. మనలాంటి దేశాలను తమ సైనికవ్యూహాలలో భాగస్వాములుగా చేసుకొని తమ చేతికి రక్తం అంటకుండా తమ ప్రత్యర్థులముందు మనలాంటి దేశాలను నిలబెట్టడమూ కనిపిస్తోంది. అమెరికా, ఫ్రాన్సు, బ్రిటన్ యువతకు తగిన ఉపాధి లభించకపోతే ప్రభుత్వాలు మారిపోతాయి. అందుచేతనే ఈ దేశాల ప్రతి అడుగూ తమ దేశాలలోని యువతకు ఉపాధి కల్పిండం మీదే దృష్టిసారించడం మనకు అర్థమవుతుంది.

**భారతీయ కార్మికులను కొల్లగొడుతున్న విదేశీ పెట్టుబడులు:**

ఈ విదేశీ పెట్టుబడులు ఎలా భారతీయ కార్మికులను కొల్లగొడుతున్నాయో కరోనా సమయంలో కర్నాటక విస్ట్రాన్ ఐఫోన్ వివాదంలో బట్టబయలు అయింది, డిసెంబరు 2020లో, కోలారుకు సమీపంలోని ఈ ఐఫోన్ కర్మాగారంలో 10,833 మంది యువత పనిచేస్తుంటే అందులో 1,343 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు, మిగిలిన 8,490 మందీ కాంట్రాక్టు కార్మికులే. వీళ్ళ పేర్లు మస్టర్ రిజిస్టరులో ఉండవు. మన ఇళ్ళకు కాంక్రీటు స్లాబ్ పోసేటప్పుడు కాంట్రాక్టరు కూలీలను తీసుకువస్తాడు. కూలీలెవరో మనకు తెలియదు కూలీల సంఖ్య మాత్రమే తెలుస్తుంది, కూలీ సొమ్ము లేబర్ కాంట్రాక్టరుకు ఇస్తాము. ఇక్కడా అంతే. దారుణమేమంటే ఇక్కడ వేతనాలు రూ.15,000/ నుండి 21,000/ వేలూ. రోజుకు 3 షిప్టుల పనీ! కరోనా విపత్తు సమయంలో దానిని రెండు షిప్టులకు మార్చేరు. 8గం॥ 4 గంటల ఓవర్ డ్యూటీ, అదనపు పనికి చెల్లింపులూ లేవు. ఈ ముష్టివేతనాలలో రూ. 7,000/– రూ. 9,000 కోతపెట్టేరు! పైగా మూడునెలలు అసలు వేతనాలే చెల్లించలేదు. ఈ దారుణాన్ని సహించని మహిళా కార్మికులు తిరుగుబాటు చేశారు. విధ్వంసం జరిగింది, విధ్వంసం గురించి మాట్లాడుతారే తప్ప, కార్మికుల వ్యధల గురించి మాట్లాడేవారే కరువయ్యారు. 120 మంది కార్మికులను అరెస్టు చేశారు. వేతనాలు దిగగోసిన మూడు నెలలుగా వేతనాలే ఇవ్వని యాజమాన్యం పై చర్యలులేవు. యాజమాన్యం వేతనాలు ఇచ్చింది కానీ కాంట్రాక్టరు చెల్లించలేదని ప్రకటించి చేతులు దులుపుకొన్నారు. గతంలో 2012 జులైలో మారుతీ సుజికీ మనేజర్ ప్లాంటులోనూ ఇదే తంతు! కాంట్రాక్టు విధానం (ఏడాదికి లక్ష వేతనం!) నెలకు రూ.8,300/ ఆ సొమ్ముతో ఓ కుటుంబం ఎలా జీవించాలో? ఇక మన విమానాశ్రయాలన్నీ మోడీసాయంతో కబ్జా చేసిన అదానీ సాబ్, విమానాశ్రయాలలో నెలకు రూ 6000 – రూ12,000 ఇవ్వజూపేడు! ఈ రూ.6,000 లతో హిందూ యువత ఎలా బతకాలో ధర్మప్రభువులూ దేవదూత, కారణజన్ముడు మోడీజీ సెలవివ్వాలి.

## గాట్ ఒప్పందం ఫలితంగా పెరిగిన దిగుమతులు:

1995లో గాట్ ఒప్పందం తరువాత దేశంలోకి విదేశీ వస్తువుల ప్రవాహం మొదలైంది. మనం వాడే కార్లు, ద్విచక్రవాహనాలు, టివీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు. పౌర విమానాలు, హెలికాప్టర్లు, విద్యుత్ జనరేటర్లు, టర్బైన్లు, ఎసిలూ ఏవీ మనవి కావు. ఇవన్నీ ఇంకా ఇతర ఆధునిక వస్తువులన్నీ అమెరికా, ఐరోపా, జపాన్, ద.కొరియా చైనాల నుంచే, దిగుమతి అవుతున్నాయి. ఓ సారి ఓవిదేశీ వస్తువు దిగుమతి అయి, అమ్ముడుపోయేక, మనం అంతకంటే నాణ్యమైన వస్తువు తయారు చేయగలిగితేనే మన స్వదేశీ పరిశ్రమ మనగలుగుతుంది. అందుకు తగిన పరిశోధనలు తెగింపూ భారత పాలకుల, లేదా పారిశ్రామికవేత్తలలో లేదు. ఏదో ఒక విదేశీ కంపెనీకి దళారీగా ఉండి, వారి సరుకులు అమ్మిపెట్టే దళారులుగా లేదా ఇక్కడ అసెంబుల్ చేసేవారుగా మిగిలిపోతున్న పరిస్థితి. ఈ పరిస్థితి ఆయుధాల తయారీలోనూ కొనసాగుతోంది.

అదే సమయంలో దేశంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడీ (Ex సుజీకీ విస్ట్రాన్) భారత కార్మికులకు ముష్టివేతనాలే ఇస్తున్నాయి. ఇదిచాలక ఫ్రీట్రేడ్ అగ్రిమెంటు (FTA )ల పేరిట దేశంలోకి విదేశీ సరుకులు అతిస్వల్ప సుంకాలతో లేదా జీరో సుంకాలతో వరదలా వచ్చిపడుతున్నాయి, ఐరోపాతో జరిగిన ఈ FTA ఒప్పందాల వల్ల దిగుమతులు 38% పైగా పెరిగాయి! చైనా నుండీ ఈ ఐరోపా అమెరికా జపాన్‌ల నుండి భారీగా వచ్చిపడే, ఈ ఆధునిక వస్తుసంచయాన్ని అమ్ముకొని, దేశీయ వ్యాపారులు తెగబలుస్తున్నారు.

అమెరికా ఐరోపాదేశాలు తమ ఆయుధాలనూ పౌరవిమానాలనూ, ఆధునిక యంత్రాలనూ మనకు అమ్ముకొని తమ సంక్షోభ భారాన్ని మనలాంటి దేశాలపై మోపి తమ మనుగడకోసం తయ యువతకు ఉపాధి చూపిస్తుంటే, మన దేశంలో మోడీ జమానా నిరుద్యోగ యువతకు ఉపాధి విషయంలో ఘోర నిర్లక్ష్యం వహిస్తోంది. అయోధ్యలో రామాలయంతో తృప్తిపడమంటోంది. ఒక్క రైల్వేలలోనే 2,50,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. గ్రూప్ C తరగతిలో 2,48,895 ఖాళీలూ, గ్రూపు B లో 2,070 ఖాళీలూ ఉన్నాయి. 3,00,000 లకు పైగా క్లర్కు పోస్టులూ ఖాళీగా ఉన్నాయి, అంతేగాదు దేశం మొత్తం మీద ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో 30 లక్షల ఖాళీలు ఉన్నాయనీ తాము అధికారంలోకి వస్తే ఈ ఖాళీలు నింపుతామనీ ఇండియా కూటమి నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రకటించాడు. పై ఖాళీలు నింపే ఉద్దేశం మోడీజీకి ఏకోశానాలేదని మనకు అర్థమవుతోంది.

ఒకవైపు దేశంలోని ప్రభుత్వరంగంలో ఖాళీలను ప్రభుత్వం భర్తీచేయదు. మరోవైపు అనేక కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న దేశంలోని తయారీ రంగాన్ని, వ్యవసాయాధారిత పరిశ్రమలను దేశాన్ని ముంచెత్తుతున్న విదేశీ వస్తువులు నుండి రక్షణ కల్పించదు. యుద్ధ సామాగ్రి, రక్షణ ఒప్పందాల పేరిట ధనిక దేశాలతో జరుగుతున్న ద్వైపాక్షిక ఒప్పందాల వల్ల ఆ దేశాలలో ఉద్యోగ కల్పన జరుగుతుండగా మనకు విదేశీ మారకద్రవ్యం ఆవిరైపోతుంది. ఈ పరాధీన పరిస్థితులు మారాలంటే దేశంలో ప్రజాతంత్ర విద్యావిధానం కోసమూ, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసమూ, గౌరవ ప్రదమైన ఉపాధి కోసమూ యువత ఉద్యమించాలి. పోరాటాలకు మనమూ అండగా నిలవాలి.

మార్క్సియ నాస్తికోద్యమ వైతాళికుడు,
నాస్తికమేళా రూపశిల్పి,
చార్వాకాశ్రమ వ్యవస్థాపకులు
సాంస్కృతికోద్యమ స్ఫూర్తి ప్రదాత

.

## చార్వాక రామకృష్ణకు జోహార్లు



చార్వాక రామకృష్ణ
01-07-1939; 18-04-2007

## నడపాలిరా.. ఎన్ని ఆటంకాలొచ్చినా

నడపాలిరా ఎన్ని ఆటంకాలొచ్చినా
నాస్తికోద్యమం లేకుంటే చైతన్యమె లేదురా ॥నడ॥

నాస్తికోద్యమ నిర్మాత రామకృష్ణ మాస్టారు
పుట్టినూరు తుళ్ళూరు గుంటూరుజిల్లాలో
శాస్త్రీయ విజ్ఞానం అందించిన వైతాళికుడు
అభినవ చార్వాకుడు రామకృష్ణ మాస్టారు ॥నడ।

పిల్లలను చేరదీసి పాఠశాల నడిపినాడు
శాస్త్రీయ విజ్ఞానం, అందించిన మహా మనిషి
చార్వాక ఆశ్రమాన్ని స్థాపించి నాడురా
గుడ్డి నమ్మకాల నడ్డి విరగ గొట్టినాడురా ॥నడ॥

చదువంటే ఉద్యమమని ఉద్యమమే జీవితమని
ఉద్యోగం మానివేసి ఉన్నత శిఖరాల కెదిగి
నాస్తిక బీజాలు నాటి రాజీలేని పోరు చేసిన
నిరంతర కృషీవలుడు రామకృష్ణ మాస్టారు ॥నడ॥

కార్ల్‌మార్క్స్ సిద్ధాంతం క్షుణ్ణంగా చదివినోడు
తాకట్టులో ఇండియాను అధ్యయనం జేసినోడు
నాస్తిక కుటుంబాలకు పండుగలు లేవని
నాస్తిక మేళాతోనే నూతన సంస్కృతిని చాటె ॥నడ॥

ప్రత్యామ్నాయ సంస్కృతికి ప్రగతిదారు లేసినట్టి
రామకృష్ణ మాస్టారు నాస్తిక మార్గాన నడచి
చెప్పిందే చేసేటి మనసున్న మహా మనిషి
అడుగడుగున పోరాటం ప్రచారాల ఆరాటం ॥నడ॥

శంబూక రథయాత్ర చేసి కులం మతం కుళ్ళు కడిగి
కులమత భేదాలు లేని పాఠ్యాంశాలెన్నో రాసి
మూఢాచారాల మీద రాజీలేని పోరు చేసి
అంబేడ్కర్ ఆశయాన్ని ఆచరించి చూపినట్టి ॥నడ॥

వేమన కవి లాగ కాకలు తీరినోడు
జీవితాన్నె ఉద్యమంగ మార్చుకున్న మాస్టారు
ఉద్యమాల సూరీడు రామకృష్ణ మాస్టారు
నీవు చూపిన మార్గంలో పయనింతుము మేమంతా.. ॥నడ॥

**– పండు,** ప్రజా కళామండలి

Editor, Printed & Published by : **B. Sudhakar** Printed at MYTRI ART PRINTERS, Mahaboobnagar.